

ఉష్ణోగ్రత (అంచనా)

23-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	38	26
తెనాలి	37	27
నరసరావుపేట	39	25
బాపట్ల	36	27
రెంటచింతల	40	26
చీరాల	36	27

వసూళ్లపై.. ఉపేక్ష



గుంటూరు నగరపాలకసంస్థ కార్యాలయం

- పన్ను బకాయిలు రూ.225.46 కోట్లు
- వసూళ్లపై పుర పాలకులు మీనమేషాలు
- వసూళ్లపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- మున్సిపాల్టీల్లో జీతాల చెల్లింపులకు ఇక్కట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో ఆస్తి, నీటి పన్నుల బకాయిలు పేరుకుపోతున్నాయి. వసూళ్లపై పుర పాలకులు మీనమేషాలు లెక్కపెడుతున్నారు. పన్నుల వసూళ్లపై అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. దీంతో పట్టణాల్లో ప్రగతి కుంటుపడుతోంది. మున్సిపాల్టీలకు ప్రధాన ఆదాయ వనరైన పన్నులు సక్రమంగా వసూలు కాకపోతుండటంతో ఉద్యోగుల జీతాల చెల్లింపులకు ఇక్కట్లు నెలకొంటున్నాయి. ఏళ్ల తరబడి ఉన్న బకాయిలను వసూలు చేయడంలో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు న్నాయి. పన్నుల ఆదాయాన్ని పెంచుకుని స్వయం సమృద్ధి సాధించాలన్న ప్రభుత్వ సూచనలను పెడచెవిన పెడుతున్న పరిస్థితులు గుంటూరు కార్పొరేషన్ సహా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాల్టీల్లో నెలకొంది. ఆస్తి పన్ను బకాయిలు రూ.225.46 కోట్లు ఉండగా నీటి పన్ను బకాయిలు రూ.కోట్లలో ఉన్నాయి. ఏళ్ల తరబడి ఉన్న బకాయిలను వసూలు చేయడంలో యంత్రాంగం అలసత్వాన్ని ప్రదర్శిస్తోందన్న విమర్శలు న్నాయి. వసూళ్లపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఆస్తి పన్ను బకాయిలతో పాటు నీటి పన్ను బకాయిలు కూడా రూ.కోట్లలో పేరుకుపోయాయి. మూడు జిల్లాల్లో రూ.225.46 కోట్లు పన్నుల బకాయిలు ఉంటే ఒక్క గుంటూరు కార్పొరేషన్‌లోనే రూ.174.82 కోట్లు బకాయిలు ఉండటం గమనార్హం. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట మున్సిపాల్టీలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థల బకాయిలు రూ.3.07 కోట్లు ఉండగా ప్రైవేట్ భవనాల బకాయి రూ.3.77 కోట్లు ఉంది. పెద్దఎత్తున బకాయిలు పేరుకుపోవడంతో కొన్ని మున్సిపాల్టీల్లో కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. రూ.వందల కోట్లు పన్ను బకాయిలు పేరుకుపో వడంతో మున్సిపాల్టీలో ప్రగతి పనులు చేపట్టే పరిస్థితులు కానరావడం లేదు. చాలా మున్సిపాల్టీల్లో చేసిన పనులకే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలేదు. దీంతో కొత్తగా పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు.

ఏటేటా పెరుగుతోన్న బకాయిలు

పన్ను బకాయిలు ఏటా పెరుగుతున్నాయే తప్ప వసూలవుతున్న దాఖలాలు లేవు. ప్రైవేట్ ఆస్తులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్తులకు సంబంధించిన బకాయిలు కూడా భారీగానే ఉన్నాయి. ప్రభుత్వ సంస్థల బకాయిలు సక్రమంగా వసూలు కావడంలేదు. పల్నాడు జిల్లాలో రూ.21.77 కోట్ల ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయి. ప్రైవేట్ భవనాలు, ఖాళీ స్థలాలకు సంబంధించి రూ.13.87 కోట్లు బకాయిలు ఏళ్ల తరబడి ఉన్నాయి. గుంటూరు జిల్లాలో రూ.193.85 కోట్లు పేరుకుపోయాయి. ప్రైవేట్ భవనాలు, ఖాళీ స్థలాల పన్ను బకాయిలు 152.86 కోట్లు ఉన్నాయి. బాపట్ల జిల్లాలో ఆస్తి పన్ను 9.84 కోట్లు బకాయిలు ఉండగా ఇందులో ప్రైవేట్ భవనాలు, ఖాళీ స్థలాలవి రూ.5.78 కోట్లు ఉన్నాయి.

మున్సిపాల్టీల వారీగా బకాయిలు..

మున్సిపాల్టీ	బకాయిలు (రూ.కోట్లలో)
పల్నాడు జిల్లా	
నరసరావుపేట	7.71
చిలకలూరిపేట	3.56
సత్తెనపల్లి	3.22
పిడుగురాళ్ల	1.86
మాచర్ల	3.16
వినుకొండ	0.89
దాచేపల్లి	0.80
గురజాల	0.57
గుంటూరు జిల్లా	
గుంటూరు కార్పొరేషన్	174.82
మంగళగిరి.. తాడేపల్లి	9.66
తెనాలి	7.98
పొన్నూరు	1.39
బాపట్ల జిల్లా	
చీరాల	4.13
బాపట్ల	3.51
రేపల్లె	1.42
అద్దంకి	0.78

ప్రభుత్వ బకాయిలూ రూ.కోట్లలో..

గుంటూరు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు సంబంధించి రూ.29.21 కోట్లు, కేంద్ర సంస్థలు, కార్యాలయాల బకాయిలు రూ.11.78 కోట్లు ఉన్నాయి. బాపట్ల జిల్లాలో కేంద్ర ప్రభుత్వ సంస్థల బకాయిలు రూ.27 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల బకాయిలు రూ.3.79 కోట్లు, పల్నాడు జిల్లా పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు సంబంధించి రూ.7.14 కోట్లు బకాయిలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించి రూ.76 లక్షలు బకాయిలు ఉన్నట్లు లెక్కలు తెలియజేస్తున్నాయి.

ఖాళీ స్థలాల పన్నులపై అలసత్వం

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వేలల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఆయా ఖాళీ స్థలాల పన్నులు ఏళ్లగా పేరుకుపోయాయి. స్థలాల క్రయవిక్రయాలు జరగడంతో యజమానుల చిరునామాలు లభించని పరిస్థితి. దీంతో ఖాళీ స్థలాల పన్ను వసూళ్లకు సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. ఒక్క గుంటూరు కార్పొరేషన్‌లోనే ఖాళీ స్థలాలకు సంబంధించి రూ.83.94 కోట్లు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి.



గుంటూరు అరండల్‌పేట అష్టలక్ష్మి దేవాలయంలో ఆంజనేయస్వామికి అభిషేకాలు

శ్రీ ఆంజనేయం

వైభవంగా హనుమత్ జయంతి

అంజనీపుత్రుడికి విశేష అభిషేకాలు, పూజలు




ప్రత్యేక అలంకరణలో పొన్నూరు వీరాంజనేయ స్వామి

గుంటూరు, పొన్నూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం. జై హనుమాన్.. జైజై హనుమాన్ అనే భక్తుల నామస్మరణలతో రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు మారుమోగాయి. హనుమత్ జయంతి వేడుకలు గురువారం జిల్లావ్యా ప్తంగా వైభవంగా జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష అలంకారాలు చేశారు. సుందరకాండ హోమాలు చేశారు. తమలపా కులు, ఫలాలతో స్వామివారిని అలంకరించి సహస్ర నామార్చనలు నిర్వహించారు. సా మూహిక హనుమాన్ చాలీసా పారా యణాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాల్లో సువర్చలాం జనేయస్వామి వారి కల్యాణోత్సవాలు, అన్నసంతర్పణలు జరిగాయి.

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో..

హనుమత్ జయంతి జిల్లావ్యాప్తంగా పలు ఆలయాల్లో ఘనంగా ఉత్సవాలు జరిగాయి. పొన్నూరులో ప్రసిద్ధి చెందిన శ్రీసహస్రలింగేశ్వరస్వామి, వీరాంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి తరలివచ్చిన వీరాంజనేయస్వామి మాల దీక్షాపరులు స్వామి వారిని దర్శించి దీక్షను విరమించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని సంగం డెయిరీ చైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. లక్ష తమలపాకులు, మల్లెపూలతో విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ సువర్చలాసమేత శ్రీవీరాంజనేయ స్వామి వారి ఉత్సవమూర్తులకు దివ్య తిరుకల్యాణ మహోత్సవం కనులపండువగా జరిపారు. తెనాలి మండలంలోని సోమసుందరపాలెంలో హనుమత్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. తెనాలిలో సుల్తానాబాద్ నుంచి హనుమాన్ శోభా యాత్ర నిర్వహించారు.

లైసెన్స్ ఉంటే.. లక్షలే



8

- మిర్చియార్డులో షాపు ప్రదేశాన్ని బట్టి రూ.20లక్షల నుంచి రూ.50లక్షల వరకు డిమాండ్
- లీజుకు ఇస్తే ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలు

సాగర్ కుడి కాల్వకు తాగునీరు విడుదల

- రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 4 టీఎంసీల కేటాయింపు



6

గ్రామగ్రామాన యోగా నిర్వహించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ ఆదేశాలు




సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ తేజ, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-2025 పేరుతో గురువారం నుంచి 26 రోజుల పాటు గ్రామగ్రామాన యోగ కార్యక్రమాలు నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవతేజ తెలిపారు. జూన్ 21వ తేదీ వరకు జరగనున్న యోగాంధ్ర - 2025 ప్రచార కార్యక్రమాల అమలుపై తీసుకోవాల్సిన చర్యలు గురించి ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల, గ్రామ స్థాయి అధికారులతో కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, ఇది మెరుగైన జీవనానికి దోహదపడుతుందన్నారు. యోగాభ్యాసాన్ని తమ జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లను ఏర్పాటు చేసి వారి ద్వారా మండల, గ్రామ స్థాయిలో యోగా శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలలో యోగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మండల, గ్రామాలలో 100, 150 మంది యోగా చేసేందుకు వీలున్న ప్రదేశాలను గుర్తించాలన్నారు. వైజాగ్ వెళ్లడానికి ఆసక్తి కలిగిన మాస్టర్ ట్రైనర్లు, యోగా గురువులు యోగాంధ్ర.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో, సచివాలయ కార్యదర్శుల ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో జూన్ 20న కల్చరల్ థీమ్ నిర్వహిస్తామని ఇందులో పాల్గొనే వారు కూడా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్‌జీవోలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్‌ను భాగస్వామ్యం చేస్తూ యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్ పీడీలు శంకర్, విజయలక్ష్మి, ప్రసాద్, డీపీవో నాగసాయికుమార్, ఎస్ఈ పంచాయతీరాజ్ గుర్రం బ్రహ్మయ్య, డీఎస్‌డబ్ల్యూఎస్ మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఉపాధి కల్పన అధికారి దుర్గా బాయి, సీపీవో శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీలో.. జగడం

- చైర్‌పర్సన్ వర్సెస్ సీఈవో
- తారాస్థాయికి చేరిన విభేదాలు
- జ్యోతిబసు బదిలీకి హెనీక్రిస్టీనా పట్టు
- హెనీక్రిస్టీనాకు మద్దతుగా ముఖ్య నేతలు?



గుంటూరు సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, సీఈవో జ్యోతిబసుల మధ్య పొసగడం లేదు. ఈ క్రమంలో సీఈవో జ్యోతిబసు బదిలీకి చైర్‌పర్సన్ గట్టిగానే పట్టుపట్టినట్లు తెలుస్తుంది. అయితే సీఈవో బదిలీని అడ్డుకునే ప్రయత్నం కూడా బలంగానే కొనసాగుతుంది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో 'వార్' పతాక స్థాయి చేరింది. చైర్‌పర్సన్ కోరినట్లుగా సీఈవోను బదిలీ చేయాలని ముఖ్య నేతలు రాష్ట్ర అధికారులకు చెప్పినట్లు తెలుస్తుంది. సీఈవో జ్యోతిబసు 2024 జూలైలో బదిలీపై రాగా వచ్చిన రోజు నుంచి చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా చెప్పిన పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న వాదన ఉంది. కొన్నిసార్లు చైర్‌పర్సన్ ఇచ్చిన ప్రకటనలకు విరుద్ధంగా కూడా ప్రకటనలు చేశారు. ఈ క్రమంలో మధ్యలో ఒకటీ రెండు సందర్భాల్లో కొందరు సయోధ్యకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. గతంలోనే సీఈవోను మార్చా లని చైర్‌పర్సన్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు లేఖ కూడా రాశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో సీఈవో బదిలీకి సంబంధించిన ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నట్లు తెలుస్తుంది.

అక్కడకు వెళ్తే అన్నీ పెండింగే..

జిల్లా పరిషత్‌లో సీఈవో దగ్గరకు వెళ్లిన ఏ ఫైల్ అయినా పెండింగ్‌లోనే ఉంటుందన్న ప్రచారం ఎక్కువగా ఉంది. జీతాల బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం తెలిపినా 15 నెలల నుంచి కొంతమంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలను పెండింగ్ పెట్టారు. జీతాలు రాక ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మరణించారు. ఇలాంటి ఉదంతాలు చాలా ఉన్నట్లు తెలుస్తుంది. అయితే సీఈవో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పనులు తాను చేయబోనని చెప్పినట్లు తెలుస్తుంది.

వైసీపీ నేతలకు జడ్పీ విషయాలు..

చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా ఎన్నికలకు ముందు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అప్పటి నుంచి వైసీపీ నేతలు ఆమెకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. ఈ పరిస్థితిలో జడ్పీలో అత్యంత కీలకమైన సమాచారం వైసీపీ ముఖ్య నేతల దగ్గరకు వెళ్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు వైసీపీ నేతల ఇళ్లకు రికార్డులు కూడా తీసుకువెళ్లినట్లు ఆరోపణలున్నాయి. కొందరు అధికారులే కీలకమైన సమాచారం వైసీపీ నేతలకు చేరవేసి చైర్ పర్సన్‌కు వ్యతిరేకంగా విలేకర్ల సమావేశాలు పెట్టించినట్లు ప్రచారం జరిగింది. ఈ విషయాలను టీడీపీ ముఖ్య నేతల దృష్టికి చైర్‌పర్సన్ వర్గం తీసుకువెళ్లడంతోనే విషయం సీరియస్‌గా మారిందని సమాచారం.

ఉపాధ్యాయ బదిలీలు.. షురూ

- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ
- సంఘాల కార్యాలయాల్లోనూ సహకారం
- సాంకేతిక సమస్యలపై సంఘాల ఆందోళన
- ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్న గుంటూరు డీఈవో



బదిలీలు, పదోన్నతుల కోసం ఏపీటీఎఫ్ కార్యాలయంలోని కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు ప్రక్రియ గురువారం సజావుగా ప్రారంభమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో జడ్పీ, మున్సిపల్, కార్పొరేషన్ యాజమాన్యాల ఆధ్వర్యంలో దాదాపు 13 వేల మందికి పైగా ఉపాధ్యాయులు ఉండగా క్యాడర్ల వారీగా పలువురు బదిలీలకు, ఉద్యోగోన్నతులకు దరఖాస్తుకు సిద్ధమయ్యారు. ఈ నెల 21 నుంచి 22 వరకు ప్రధానోపాధ్యాయులకు, 21 నుంచి 24 వరకు స్కూల్ అసిస్టెంట్లకు, 21 నుంచి 27వ తేదీ వరకు ఎస్జీటీలకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని విద్యాశాఖ కల్పించింది. దీంతో గురువారం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ వేగవంతమైంది. ఇందు కోసం విద్యాశాఖ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసింది. విద్యాశాఖ కార్యాలయంలోని ఐటీ సెల్‌లో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతికంగా వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. మరోవైపు ఉపాధ్యాయ సంఘాలు కూడా తమ కార్యాలయాల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో బదిలీల ప్రక్రియ కోసం ఉపాధ్యాయులకు అవసరమైన సహాయ సహకారా లను అందిస్తున్నాయి. ఏపీటీఎఫ్, ఎస్టీయూ, యూటీఎఫ్ కార్యాలయాల్లో దరఖాస్తులు అప్‌లోడులో తలెత్తే సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. దరఖాస్తుల అప్‌లోడు ప్రక్రియలో కొన్ని సాంకేతిక సమస్యలు వస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాలు వెల్లడిస్తు న్నాయి. ప్రధానంగా రెండు డీఎస్సీలలో ఎంపికైన ఉపాధ్యాయులకు సర్వీస్ రికార్డు సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక సర్వీస్‌ను మాత్రమే సాఫ్ట్‌వేర్ పరిగణనలోకి తీసుకుం టున్నట్లు చెబుతున్నారు. డేటాఫ్ జాయినింగ్ విషయంలో కొంత మందికి ఒక రోజు తక్కువగా చూపుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దరఖాస్తు చేసే వారిలో కొంతమందికి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ ఉంటే సాఫ్ట్‌వేర్‌లో మ్యాథ్స్‌గా చూపుతున్నట్లు చెబుతున్నారు. రీ అపోర్షన్మెంట్ పాయింట్స్ రావడంలేదని, రిక్వెస్ట్ బదిలీ వారికి కంపల్సరీ బదిలీ అని వస్తున్నట్లు పలువురు ఆందోళన చెందుతున్నారు. ఆయా సాంకేతిక సమస్యలను ఎ ప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని గుంటూరు డీఈవో రేణుక స్పష్టం చేశారు.

అబద్ధాలకు అలవాటుపడిన జగన్‌రెడ్డి

● ప్రజలు బుద్ధి చెప్పినా మారని వైనం

● రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్



మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, మే 22(ఆంధ్రజ్యోతి): అబద్ధాలకు అలవాటు పడ్డ జగన్‌రెడ్డి నాలుక ఎటుతిప్పినా అబద్ధాలనే మాట్లాడతాడని రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. గు రువారం జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన ప్రెస్‌మీట్‌కు మంత్రి అనగాని స్పందించారు. ప్రజలు బుద్ధి చెప్పినప్పటికి ఇంకా ఫేక్ బతుకు నుంచి మాత్రం జగన్ బయటకు రాలేకపోతున్నార న్నారు. అప్పుల నుంచి విద్యుత్ కొనుగోలు వరకు అన్నింటిపైనే అబద్ధాలే చెప్పుకుంటూ ప్రజలను మోసం చెయ్యటానికి సిద్ధమయ్యారన్నారు. గత ప్రభుత్వ హ యాంలో ఇష్టానుసారంగా అప్పులు చేసి స్కీమ్‌ల పేరుతో కోట్లరూపాయలు స్కామ్‌లు చేసిన చరిత్ర జగన్‌రెడ్డిదేనన్నారు. అప్పుతెచ్చిన ప్రతి రూపాయిని సంక్షేమంతోపాటు అభివృద్ధికోసం ఖర్చుచే స్తున్నది కూటమి ప్రభుత్వం అన్నారు. యాక్సెస్ ఎనర్జీతో యూనిట్‌కు రూ.5.12చొప్పున ఒప్పందంచేసుకున్న జగన్‌రెడ్డి రూ.2.10కే ఒప్పందం చేసుకున్నట్లు నంగనాచిలా అబద్ధాలు చెబుతున్నారన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంతో పోలిస్తే చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో రెవెన్యూ రాబడి 4.74 శాతం పెరిగిందని, కానీ జగన్‌రెడ్డి మాత్రం అంకెలగారడీ చేస్తు న్నారన్నా రు. అమ రావతి రాజధానిపై ఇచ్చిన మాట తప్పి ప్రజలతో ఛీకొట్టించుకున్నా బు ద్ధిరాని జగన్ ఇంకా విషప్రచారం చేద్దామని కుటిల రాజకీయాలు చేస్తున్నారన్నారు.

27న బర్లీ పొగాకు రైతుల దీక్షలు

చిలకలూరిపేట, మే 22(ఆంధ్రజ్యోతి): ఐటీ సీ కంపెనీతోపాటు అన్ని కంపెనీలు రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చెయ్యాలని డిమాండ్ చేస్తూ అన్ని రైతు సం ఘాల నాయకుల నిర్ణయం మేరకు పట్టణం లోని నరసరావుపేట రోడ్డులో ఉన్న ఐటీసీ కం పెనీ వద్ద ఈ నెల 27వ తేదీన పొగాకు రైతు ల నిరసన దీక్ష చేపడుతున్నట్లు నల్లమడ రైతుసంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమో హనరావు గురువారం తెలిపారు. వ్యవసాయ శాఖ దగ్గర ముందస్తు ప్రణాళిక లేకపోవడం వలన ఎక్కువమంది రైతులు బర్లీ పొగాకును సాగుచేసి నష్టపో యారని, గత్యంతరం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కంపె నీలన్నీ సిండికేట్ అయ్యి బర్లీ పొగాకును తక్కువరేట్లకు మధ్యవర్తుల ద్వారా కొనుగోలు చేసి, పొగాకు రైతులను పెద్ద కంపెనీలు దెబ్బ తీస్తున్నా యన్నారు. కంపెనీల మాటలను న మ్మి పలువురు రైతులు ముఖ్యంగా కౌలు రైతులు అప్పుచేసి భారీగా బర్లీ పొగాకు సాగు చేసి, పంటచేతికి వచ్చాక కొనుగోలు చేసేవారు లేక తీవ్రంగా ఆందోళన పడుతున్నారని చెప్పారు. బర్లీ పొగాకును కేంద్ర ప్రభుత్వం వెంటనే పొగాకు బోర్డు పరిధిలోకి తీసు కురావాలని ఆయన డిమాండ్ చేశారు.

వర్సిటీలో నకిలీ చలానాల కలకలం

పెదకాకాని, మే 22(ఆంధ్రజ్యోతి): నాగార్జున విశ్వవిద్యాలయంలో సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కట్టిన ఫీజు సొమ్మును ఓ ఉద్యోగి కాజేసి అధికారులను బురిడీ కొట్టించాడు. విద్యార్థులు తమకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం ఫీజు చెల్లించాల్సి వుంటుంది. అయితే ఆ ఉద్యోగి విద్యార్థుల వద్ద ఫీజు వసూలు చేసి ఆ మొత్తాన్ని బ్యాంకులో జమ చేయకుండా నకిలీ చలానాలు పెట్టి విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలిసింది. విద్యార్థుల వద్ద వసూలు చేసిన మొత్తం పది లక్షల రూపాయలకు పైగానే వుంటుందని అంచనా వేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆఫీసులో జరిగిన ఈ వ్యవహారాన్ని గోప్యంగా వుంచారు. దీంతో ఈ దొంగ చలానాల వ్యవహారం కొంత మంది అధికారుల కనుసన్నల్లో జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమగ్ర విచారణ చేస్తే ఆ ఉద్యోగి, అధికారుల అక్రమాలు మరిన్ని వెలుగులోకి వచ్చే అవకాశం వుందని పలువురు విద్యార్థులు, తోటి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

సొంతూరిపై మమకారం అభినందనీయం

● ఎడ్ల బలప్రదర్శన పోటీల ముగింపు సభలో ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, నసీర్ అహ్మద్



మాట్లాడుతున్న గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



3వ రోజు ఎడ్ల బలప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

పీసీపల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం గుంటూరులో స్థిరపడినప్పటికీ సొంతూరిపై మమకారంతో అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో పాటు పల్లె సంస్కృతిని అద్దం పట్టేలా ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్న కొంపల్లి మాలకొండయ్య అభినందనీయులని కనిగిరి, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, నసీర్ అహ్మద్‌లు అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా మండ లంలోని వెంగళాపురం సమీపంలో మూడురోజులుగా నిర్వహి స్తున్న జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు గురువారం ముగిశాయి. నిర్వాహకుల ఆహ్వానం మేరకు ముగింపు రోజు జరిగిన ఎడ్ల బలప్రదర్శన పోటీలో వీరు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లా డుతూ ఒంగోలు జాతి ఎద్దు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాయన్నారు. గతంలో ప్రతి ఊరిలో ప్రతి ఇంటికి ఒక కాడె ఎడ్లు ఉండేవన్నారు. ప్రస్తుతం యాంత్రీకరణ పద్ధతిలో వ్యవసాయం చేస్తుండడంతో ఏటేటికీ గ్రామాల్లో ఎడ్ల సంఖ్య తగ్గిపోతుందన్నారు. ఈతరుణంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలకు వచ్చిన ఎడ్లను చూస్తుంటే సంతోషంగా ఉందని వార న్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఈ ప్రాంతం వారు ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోకుండా ఉండేందుకు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌ను ఇక్కడికి తీసుకురావడంతో పాటు ఎంఎ స్ఎంఈ పార్కులను కూడా మంజూరు చేయించారన్నారు. నిరంతరం కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి ప్రజలందరూ అండగా ఉండాలని ఆయన కోరారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించేం దుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సూచన మేరకు త్వరలో కనిగిరిలో స్టేడియంను నిర్మించబోతున్నట్లు చెప్పారు.

గురువారం నిర్వహించిన సీనియర్ పోటీల విభాగంలో నంద్యాల జిల్లా హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఎమ్.రామసు బ్బారెడ్డికి చెందిన ఎద్లు 3103.2మీటర్లు బండ లాగి ప్రథమస్థా నంలో విజేతగా నిలిచాయి. నంద్యాలజిల్లా జిల్లెల గ్రామానికి చెందిన దినేష్‌రెడ్డి, హిత్విక్‌రెడ్డి ఎడ్లు 3017.3మీటర్లు బండలాగి ద్వితీయస్థానం, బాపట్లజిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోటి వీరేషచౌదరి, శివక్రిష్ణ చౌదరిల ఎడ్లు 3000మీటర్లు లాగి తృతీయ స్థానంలో నిలిచాయి. వీటితో పాటు 7వ స్థానం వరకు విజేతలుగా నిలిచిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కొంపల్లి మల్లికార్జున, మధు, వెల్ది కొండయ్య, గుదే నాగేశ్వరరావు, రావి రామాంజనేయులు, వడ్డెంపూడి చిన్నా, వడ్డెంపూడి శ్రీను, రామా రావు, సుబ్బారావు, పెద రాఘవయ్య, సోమయ్య, సతీష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరి అనుమానాస్పద మృతి

● మృతదేహంపై పలు గాయాలు ● పుసులూరు గ్రామ శివారులో ఘటన



తలపల శివయ్య ఫైల్‌ఫొటో

పెదనందిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పుసు లూరు గ్రామ శివారులో గొర్రెల కాపరి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నా యి.. పుసులూరు గ్రామానికి చెందిన తలపల శ్రీనివాసరావు (42) ఎ ప్పటిలాగానే బుధవారం ఉదయం గ్రామ సమీపంలోని పొలాల్లోకి గొర్రె ల మందను తోలుకొని వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడం తో భార్య ఫోన్ చేయగా ఫోన్‌స్విచ్ఛాఫ్ రావడంతో, పొలానికి వెళ్లి వెతక గా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం పుసులూరు - వల్లూరు వెళ్లే రహదారిలో పొలాల్లో మృతదేహాన్ని అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి గ్రామస్థు లకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా శ్రీనివాసరావు మృత దేహంగా గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ భానోదయ, సీఐ శ్రీనివాసరావు, సీఎస్ డీఎస్పీ శివాజీ, ఎస్ఐలు మధుపవన్, ఏక్‌నాథ్‌లు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా శరీరంపై పలు గాయాలు ఉన్నట్లు గుర్తించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. భార్య చెంచుకుమారి ఫిర్యాదు మేరకు కా కుమాను పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏకనాథ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

బంగారం షాపులో చోరీపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, మే 22(ఆంధ్రజ్యోతి): బంగారం షాపులో ఉద్యోగిగా చేరి నగలు చోరీ చేశాడంటు యజమాని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీ సులు తెలిపారు. గురువారం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గంగానమ్మపేటకు చెందిన బన్సారి రమేష్‌కుమార్ ముత్తా ఎంఎం జ్యూయలర్స్ షాపులో. మేనేజింగ్ పార్టనర్. ఇదే షాపులో ఆదే ప్రాంతానికి చెందిన అనిల్‌కుమార్ జైన్ చౌదరి స్టోర్, స్టాక్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 14న షాపు నుండి ఇంటికని వెళ్లి తిరిగిరాలేదు. అనిల్‌కుమార్ జైన్ కుటుంబ సభ్యులను విచారించగా ఎక్కడికి వెళ్లింది తెలియదని అతని సెల్‌ఫోన్ కూడా ఇంటిలోనే పెట్టి వెళ్లాడని తెలిపారు. అతని ప్రవర్త నపై అనుమానంతో షాపులోని సీసీ కెమోరాలను పరిశీలించి స్టాక్ తనిఖీ చేయగా సుమారు కేజి 509గ్రాముల బంగారం చోరీకి గురైందని, వాటి విలువ సుమారు రూ.కోటి 45లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితుడు రమేష్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యో తి): కాగే నూనెను భార్యపై పోసి హతమార్చిన ట్లు నేరం రుజువ వడంతో నిందితుడు పల్నాడు జిల్లా పిడుగురాళ్లకి చెందిన బొగ్గవరపు నాగ రాజుకు జీవిత ఖైదు, రూ.20వేల జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు న్యాయాధికారి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథ నం ప్రకారం.. నిందతుడు నాగరాజుకు 14 సంవ త్సరాల క్రితం మేరీతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. అనంతరం భార్యాభర్తల మధ్యస్పర్థలు తలెత్త డంతో మేరీ ఈపూరు మండలం కూచినపల్లిలో తన పుట్టింటికి వెళ్ళింది. 2023 ఏప్రిల్ 9న సాయంత్రం ఆ గ్రామంలో తిరుణాళ్ల జరుగుతుండడంతో మేరీ కుటుంబస భ్యులు వంటకాలు చేస్తున్నారు. అక్కడికి వచ్చిన నాగరాజు, మేరీతో ఘర్షణకు దిగి కోపంతో పొయ్యిపై కాలుతున్న నూనెను ఆమెపై పోశాడు. తీవ్రగాయాలపాలైన ఆమెను చికిత్స నిమిత్తం గుంటూరు సమగ్ర ప్రభుత్వవైద్యశాలకు తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ న్యాయ అధికారికి మరణ వాంగ్మూలం ఇచ్చారు. తదుపరి చికిత్సపొందుతూ మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదుచేసిన ఈపూరు పోలీసులు నింది తుడిని అరెస్టుచేసి కోర్టులో ప్రవేశపెట్టారు విచారణలో నేరం రుజువవడంతో వరకట్నం కేసు లో మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా, హత్యకేసులో జీవితఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ, శిక్ష మొత్తం ఏకకాలంలో అనుభవించే లా కోర్టు తీర్పుచెప్పింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ దేసిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు.

రెండు రైళ్ల రద్దు... కొన్ని దారి మళ్లింపు

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్‌లోని మహబూ బాబాద్ వద్ద ప్రీఎన్ఐ/ఎన్ఐ పనుల కారణంగా పలు రైళ్లు రద్దు అయ్యా యి. నంబరు 12706/12705 సికింద్రాబాద్-గుంటూరు-సికింద్రాబాద్ ఇంట ర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు పూర్తిగా రద్దు చేశారు. నంబరు 17202 సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని 28వ తేదీ వరకు కాజీపేట వరకే నడుపుతారు. నంబరు 17201 గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ని కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు నడుపుతారు. నంబరు 18519/18520 విశాఖపట్టణం - ఎల్‌టీటీ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 28వ తేదీ వరకు విజయవాడ నుంచి గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ మీదగా సికింద్రాబాద్‌కు దారి మళ్లించి నడుపుతారు. ఇదేవిధంగా నంబరు 12522 ఎర్నాకుళం - బౌరాని రప్తీసాగర్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 23వ తేదీన తెనాలి, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్ మీదగా దారి మళిస్తారు.

24 నుంచి తృతీయ జాతీయ స్థాయి నాటికల పోటీలు

నాదెండ్ల, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామంలో ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు తృతీయ జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్లు నటరత్న ఎన్‌టీఆర్ కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి నడింపల్లి వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. గ్రామంలోని భారతీ కళా వేదిక పై 24వ తేదీన కళాభినయ విశాఖపట్నం వారి ఓ కాశీ వాస రావయ్య, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ గుంటూరు వారి మరీ అంతొద్దు, 25న శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు, భద్రం ఫౌండేషన్ విశాఖపట్నం వారి దొందూ దొందే, హేలాపురి కల్చరల్ అసోసియేషన్ ఏలూరి వారి సారి రాంగ్ నెంబరు, 26న సహృదయ ద్రోణాదుల బాపట్ల వారి వర్క్ ఫ్రమ్ హోమ్, వజ్జా రామనాథం ఆర్ట్స్ సాతులూరి వారి రారాజు సుయోధన పౌరాణిక నాటిక, జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక వరంగల్ వారి ఏకాకి, 27న గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ, న్యూఢిల్లీ వారి అనస్వరం, మద్దుకూరి ఆర్ట్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహా భారతం, 28న అరవిందో ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి, అద్దెపల్లి ఆరాధ్యుల ఆర్ట్స్ తెనాలి వారి ఎవరు, ఉషోదయ కళానికేతన్ కాట్రపాడు వారి కిడ్నాప్ నాటికల ప్రదర్శనలు జరుగుతాయని ఆయన వివరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి



అంకమ్మ ఫైల్‌ఫొటో

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మే 22 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం లోని గొడవర్రులో చోటుచేసుకుంది. చేబ్రోలు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపిన వివ రాల ప్రకారం గొడవర్రు గ్రామానికి చెందిన పల్లా అంకమ్మ (55) గొర్రెల కాపరిగా రాత్రి సమయంలో మందలను కాపలాకాస్తుంటాడు. రోజు మాదిరి గానే కాపలాకాసేందుకు బుధవారం పంటపొలాలకు వెళ్లాడు. తెల్లవారినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతడికోసం పరిసర ప్రాంతాల వారిని విచారించారు. అతను కాపలాకు వెళ్లిన పొలాల్లో గురువారం మృతి చెంది ఉన్నాడు. పిడుగు పాటుకు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి వివా హమై భార్య మృతి చెందగా ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటకృష్ణ పేర్కొన్నారు.



చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

వ్యాపార, వాణిజ్యవర్గాలకు అండగా కూటమి ప్రభుత్వం

● ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభు త్వంలో వాణిజ్య, వ్యాపార వర్గాలవారు ఎలాంటి ఆందోళన, భయం లేకుండా ప్రశాంతంగా తమ కార్యకలాపాలు సాగించుకోవచ్చునని, గతంలో మాదిరి వేధింపులు, దౌర్జన్యాలు, బెదిరింపులకు స్థానం లేదని ఎమ్మె ల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణమండ పం లో గురువారం చిలకలూరిపేట నియోజకవర్గ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నా రు. వ్యాపారులకు అన్నివిధాల తోడ్పాటునందిస్తామని తెలిపారు. వ్యాపారులు తమ సంపాదనలో కొంతభాగాన్ని ప్రజాసేవకు వెచ్చించాలని, వివిధ మార్గాల్లో పదిమందికి సాయపడేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్య క్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు, గుంటూరు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, కందుల రమణ, వెల్లంపల్లి రవిశంకర్, కనమర్లపూడి రమేష్ పాల్గొన్నారు.

భూకేటాయింపునకు సీఎస్‌కు ఏపీ గ్రామీణ బ్యాంకు చైర్మన్ విజ్ఞప్తి

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటుచేసేందకు అమరావతిలో భూమి కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్‌కు ఆ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని కార్యాలయంలో సీఎస్ విజయానంద్‌ను బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి గురువారం కలిశారు. అమరావతిలో ఏపీ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు భూకేటాయింపు చేయాలని వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫైనాన్సియల్ ఇంక్లూషన్, గ్రామీణాభివృద్ధిని విస్తరించాలన్న బ్యాంకు దృష్టిని సీఎస్‌కు వివరించినట్లు తెలిపారు. రాజధాని ప్రాంతంలో శాశ్వత ప్రధాన కార్యాలయాన్ని స్థాపించటం ద్వారా బ్యాంకు పరిపాలనా సామర్థ్యాలు బలపడతాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామీణ ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు. దీనిపై సీఎస్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సమావేశంలో చైర్మన్‌తో పాటు బ్యాంకు జనరల్ మేనేజర్ హరీష్ బేతా తదితరులున్నారు.

సాగర్ కుడి కాలువకు తాగునీరు విడుదల



సాగర్ కుడి కాలువకు విడుదలవుతున్న తాగునీరు

మాచర్లటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువకు గురువారం అధికారులు తాగునీ టిని విడుదల చేశారు. కృష్ణానది యాజ మాన్య బోర్డు ఆదేశా లతో సాగర్ కుడి కాలువ ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగు వకు విడుదల చేశారు. రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున మొత్తం 4 టీఎంసీల నీటిని అధికారులు విడుదల చేయనున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 22(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 512.60 అడుగులు ఉంది. ఇది 136.12 టీఎంసీలకు సమానం. కుడికాలువ ద్వారా 4459 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 450, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 4909 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే నసీర్, మేయర్ నాని

తెలుగుదేశానికి కార్యకర్తలే మూల స్తంభాలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలని, దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని కార్యకర్తల బలం తెలుగుదేశం పార్టీకి ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన అధ్యక్షతన గురువారం జిల్లా మహానాడు సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్ల జిల్లాలో వైసీపీ అరాచక పాలనకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ఎన్నో పోరాటాలు, ధర్నాలు చేశారన్నారు. ఈనెల 25న సాయంత్రం 5 గంటలకు పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా మహానాడు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని అన్నారు. మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ దాసరి రాజామాష్టారు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో మద్దిరాల ఇమ్మానియేల్, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు, కసుకుర్తి హనుమంతరావు, మానుకొండ శివప్రసాద్, కంచర్ల శివరామయ్య, అడకా శ్రీనివాసరావు, దామచర్ల శ్రీనివాసరావు, గుంటుపల్లి మధుసూదనరావు, రావిపాటి సాయికృష్ణ, మన్నవ వంశీకృష్ణ, వేములకొండ శ్రీనివాస్, బొబ్బిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

భారత జాతి పునరుజ్జీవ పితామహుడు.. రాజారామ్మోహనరాయ్

గుంటూరు(తూర్పు), మే 22(ఆంధ్రజ్యోతి) : ఆనాటి భారతదేశంలో వేళ్ళునుకుని ఉన్న మూఢ దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టి, భారత జాతి పునరుజ్జీవానికి కృషి చేసిన తొలి పితామహుడు రాజా రామ్మోహన్‌రాయ్ అని ప్రముఖ విద్యావేత్త డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి కొనియాడారు. బాలానంద కేంద్రం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట, రాజా రామ్మోహన్ రాయ్ పాఠశాల ప్రార్థన సమాజం ఆవరణలో గురువారం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభకు బాలానంద కేంద్రం కార్యదర్శి నడింపల్లి గురుదత్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బాలానంద కేంద్రం గౌరవాధ్యక్షుడు, ఆడి టర్ కేతరాజు నరసింహారావు, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లం రెడ్డి లక్ష్మణరెడ్డి, వెంకట రామకోటి ముత్యాలు, శ్రీనివాసరావు, మూర్తి, ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి వావిలాల రామ్‌కుమార్ పాల్గొన్నారు

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు అపూర్వ గౌరవం

● మా- ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా


మాట్లాడుతున్న దిలీప్ రాజా

గుంటూరు(తూర్పు), మే 22 (ఆంధ్రజ్యోతి): ఫ్రాన్స్‌లో జరుగుతున్న 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్-అన్ సర్టెన్ రిగార్డ్ విభాగంలో భారత చలనచిత్రం 'హోమ్ బౌండ్'కు తొమ్మిది నిమిషాల స్టాండింగ్ ఓవేషన్ గౌరవం దక్కించుకుని, అరుదైన రికార్డ్‌ను సృష్టించిందని మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా చెప్పారు. స్థానిక రాజీవ్ గాంధీనగర్, బ్యాంక్ కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీరజ్ ఘయ్యాన్ దర్శకత్వంలో జాన్వికపూర్, ఇషాన్ ఖట్టర్ నటించిన హోమ్ బౌండ్ సినిమా కేన్స్ అవార్డుకు ఎంపికైన తొలి భారతీయ సినిమా అని చెప్పారు. జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో సినిమాల ప్రదర్శనలను నిలిపివేస్తున్నట్లుగా ఎగ్జిబిటర్లు ప్రకటించారని, దీనిపై సినిమా పెద్దలు సమస్యకు పరిష్కారమార్గాన్ని చూడాలని కోరారు.

లౌకిక స్ఫూర్తిని దెబ్బతీస్తున్న బీజేపీ : రమాదేవి

గుంటూరు(తూర్పు), మే 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ అధికారంలోకి వచ్చాక భారత రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తుందని, ప్రజల మధ్య మతం పేరుతో అనైక్యతను సృష్టిస్తుందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి మండిపడ్డారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.నళినికాంత్ అధ్యక్షతన ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలను అమలు జరపాలని, విద్యుత్ ఛార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్ల బిగింపు నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ నిధులను బట్టిగాకుండా భవిష్యత్ అవసరాలు దృష్ట్యా శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణం జరగాలన్నారు. గుంటూరు ఛానల్, వరికెపూడిశెల, నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, పాశం రామారావు, ఈమని అప్పారావు, ఎస్.భావన్నారాయణ, ఎం.రవి, ఎల్.అరుణ తదితరులు పాల్గొన్నారు.

29న ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజులకు టెండర్లు : డీపీటీవో

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్టీసీ బస్టాండ్‌ల పరిధిలోని ఖాళీ స్థలాల లీజులకు సంబంధించి ఈనెల 29న టెండర్ దాఖలు కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎం.రవికాంత్ తెలిపారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని తిక్కన సమావేశ మందిరంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెదకాకానిలో మూడు బిట్‌లు, తెనాలిలో రెండు బిట్‌లు, పెదనందిపాడు బస్టాండ్ ప్రాంతంలో ఖాళీ స్థలాలకు సంబంధించి 15 ఏళ్ళకు లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. 28న సాయంత్రం 5 గంటల వరకు టెండర్లు ఫారాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం ఇతర అధికారులున్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన సీహెచ్‌ఓలు

గుంటూరు సిటీ, మే 22(ఆంధ్రజ్యోతి) : తమ డిమాండ్స్ సాధన కోసం కొద్ది రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ గురువారం డిప్యూటీ ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిశారు. మంగళగిరి సమీపంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద డిప్యూటీ సీఎంను కలిసి వినతిపత్రం అందజేసేందుకు రోడ్డు మీద నిలబడిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌ను కారులో వెళ్తూ గమనించిన పవన్ కళ్యాణ్ దగ్గరకు పిలిచి మాట్లాడారు. సంబంధిత అధికారులతో మాట్లాడాలని తన ఓఎస్‌డీకి డిప్యూటీ సీఎం సూచించారు. ఏపీ ఎంసీపీ గుంటూరు జిల్లా ప్రెసిడెంట్ టి.ప్రవళిక, పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ అనుపమ, కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ ఝాన్సీ, గుంటూరు జిల్లా వైస్ ప్రెసిడెంట్ వనజ, జ్యోత్స్న, ఆయా జిల్లాల సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

గుర్రపువాతం నుంచి రక్షణ పొందండి : డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : అధిక రక్తపోటుతో బాధపడే హైరిస్క్ గర్భిణులు తగిన వైద్య పర్యవేక్షణలో లేకుంటే గుర్రపువాతం (ఎక్లాంప్సియా) అనే ప్రాణాంతక జబ్బు బారిన పడే ప్రమాదం ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి హెచ్చరించారు. ప్రీ ఎక్లాంప్సియా దినోత్సవం పురస్కరించుకొని గురువారం ఎన్జీవోస్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం బీపీ ఉన్న గర్భిణులకు వైద్య సిబ్బంది కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ.శ్రావణ్‌బాబు, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

వైద్య పరిశోధనలపై ఆసక్తి కలిగి ఉండాలి : ప్రిన్సిపాల్

గుంటూరు మెడికల్, మే 22 (ఆంధ్రజ్యోతి): మెడికల్ పీజీ విద్యార్థులు వైద్య పరిశోధనలపై ఆసక్తి కలిగి ఉండాలని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ సూచించారు. జింకానా ఆడిటోరియంలో గురువారం మెడికల్ పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు రీసెర్చ్ మెథడాలజీ, థీసిస్ ప్రిపరేషన్ అనే అంశంపై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సీతారామ అధ్యక్షత వహించారు. శిక్షణలో భాగంగా డాక్టర్ జయంతి (గైనకాలజీ), డాక్టర్ అనిల్ (ఎస్‌పీఎం) తరగతులు నిర్వహించి, థీసిస్ ప్రోటోకాల్‌ను సమీక్షించారు. ఈ వర్క్‌షాప్‌లో 180 మంది పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాంధ్రాను విజయవంతం చేయాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, మే 22(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025 ని నగరంలో విజయవంతం చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నగరంలో యోగాంధ్ర 2025 కార్యక్రమ అమలుపై గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మేయర్ మాట్లాడుతూ యోగా దినోత్సవం సందర్భంగా నగరంలో ఆసక్తి కలిగిన వారు వెబ్ సైట్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకొని విజయవంతం చేయాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ యోగాంధ్ర 2025పై నగరంలో పోస్టర్స్, వాల్ రైటింగ్, బ్యానర్ల ద్వారా ప్రజలకు అవగాహన కలిగిస్తామన్నారు. యోగా చేయాలనుకునేవారు, మాస్టర్ ట్రైనర్లు, యోగా గురువులుగా వైజాగ్‌కి వెళ్లడానికి ఆసక్తి కల్గిన వారు వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం యోగాంధ్రలో భాగంగా ఒక్కో జిల్లాకు ఒక థీమ్ ప్రకటించిందని, అందులో భాగంగా గుంటూరు జిల్లాకు కల్చరల్ వింగ్ ఇచ్చిందని, జూన్ 20న జిల్లా స్థాయిలో నిర్వహించే కల్చరల్ సెషన్‌లో పాల్గొనే ఆసక్తి కలిగిన వారు కూడా వెబ్ సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

యోగాంధ్ర-25లో మాస్టర్ ట్రైనీలు పాల్గొనాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): మాస్టర్ ట్రైనీలు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025 కార్యక్రమాల్లో పాల్గొనే ప్రజలకు యోగాపై అవగాహన కలిగించేలా ట్రైనర్లను సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. గుంటూరులో యోగాంధ్ర 2025 కార్యక్రమ అమలుపై ఆసక్తి కలిగిన యోగా మాస్టర్ ట్రైనీలతో కమిషనర్ చాంబర్‌లో గురువారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డుల వారీగా జీఎంసి ఏర్పాటు చేసే శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు ట్రైనర్లు అవసరమని, అందుకు తగిన విధంగా వారిని మాస్టర్ ట్రైనీలు తమ దగ్గర యోగా శిక్షణ ఇచ్చే వారి వివరాలను తమకు అందించాలని కోరారు. సమావేశంలో యోగా మాస్టర్ ట్రైనీలు వై.అంకమ్మరావు, పి.ప్రసాద్, వి.అంకినీడు ప్రసాద్, జి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల్లో అప్రమత్తంగా ఉండాలి : యూటీఎఫ్

గుంటూరు (విద్య) మే 22 (ఆంధ్రజ్యోతి): బదిలీలు పదోన్నతుల విషయంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు సూచించారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక పాయింట్లు రేషనలైజేషన్, ప్రిఫరెన్షియల్ కేటగిరి తదితర అంశాలపై అవగాహన ఉండాలని, దరఖాస్తు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం హనుమంతరావు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యు రాజశేఖర్, ఎం.కళాధర్, జి వెంకటేశ్వరరావు, బి ప్రసాద్, ఎం.కోటిరెడ్డి, ఎం.చెన్నయ్య, కే.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

బదిలీలు, పదోన్నతుల కోసం హెల్ప్‌లైన్ సెంటర్

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్ ప్రాసెస్ మొదలైన దృష్ట్యా జిల్లాలోని ఉపాధ్యాయుల సౌకర్యార్థం ఎస్టీయూ భవన్, గుంటూరులో ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు ప్రధాన కార్యదర్శి డి.కె.సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ నాయకులు, సాంకేతిక నిపుణులు వై.శ్యాంబాబు జె.వెంకటేశ్వరరావు, మహంకాలరావు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎస్టీయూ భవన్‌లో ఉపాధ్యాయులు పదోన్నతులు, బదిలీలకు సంబంధించి సేవలు అందించేందుకు అందుబాటులో ఉంటారని, ఉపాధ్యాయులు తగిన సమాచారంతో హాజరై ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ కాలుష్యంపై పోరాడుతాం : రైల్వే ఏడీఎంఈ

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి ముప్పుగా పరిణమించిన ప్లాస్టిక్ కాలుష్యంపై అందరూ పోరాడాలని రైల్వే గుంటూరు ఏడీఎంఈ(పవర్) బాపయ్య విజ్ఞప్తి చేశారు. ఆయన గుంటూరు రైల్వేస్టేషన్‌లో అంతర్జాతీయ పర్యావరణ దినం పక్షోత్సవ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించారు. బాపయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు నూరు శాతం తగ్గించాలన్నారు.

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు

గుంటూరు సిటీ, మే 22(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు చేపట్టారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండల ఎంపీడీఓ కార్యాలయం ఆఫీస్ సబార్డినేట్‌గా కూరాకుల అరవిందుకు నియామక పత్రాలను ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ గురువారం అందజేశారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కారుణ్య నియామకాలలో భాగంగా అరవిందుకు ఈ ఉద్యోగ బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో అకౌంట్ ఆఫీసర్ పుల్లగూర శామ్యూల్ పాల్, ఏవో జి.రాజారత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడిపై కత్తితో దాడి

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్ఆర్ కాలనీ మూడో లైన్ కి చెందిన షేక్ నాగూర్ ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్నాడు. తన స్నేహితుడైన గోపి కూడా తన ఇంటి వద్దనే ఉంటూ ఎటు పనికి వెళ్లకుండా ఉంటాడు. బుధవారం రాత్రి సమయంలో గోపిని ఏదో ఒక పనికి వెళ్ళమని నాగూర్ మందలించాడు. ఈ సమయంలో నాగూర్ తన చెల్లిని తిట్టాడనే కారణంతో గోపి తన వద్ద గల బ్లేడుతో నాగూర్ మెడపైన కోసాడు. దీంతో అయనకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నాగూర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి కాజేస్తున్నారని ఫిర్యాదు

స్థానిక అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అరండల్‌పేటకు చెందిన ఇందిర అనే మతిస్థిమితం సరిగా లేని మహిళ ఆస్తిని ఆమె మేనమామ కాజే చేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరకు సుమారు 30 నుంచి 40 కోట్ల ఖరీదైన ఆస్తులు ఉన్నాయి. ఏడాది క్రితం ఆమె తల్లి కన్ను మూసింది. అప్పటివరకు ఆస్తి వ్యవహారాలన్నీ తల్లి చూసుకునేది. తల్లి మరణానంతరం ఆమె సోదరుడు చంద్రశేఖరరావు, ఆయన కుమారుడు మాధవరావు చూసుకుంటున్నారు. అయితే మతిస్థిమితం సరిగా లేని ఇందిర చేత వేలిముద్రలు, సంతకాలు తీసుకొని ఆమె ఆస్తులను చంద్రశేఖరరావు, మాధవరావులు కాజేస్తున్నా రని ఆమె పెద్దమ్మ కుమారుడు పరుచూరి విష్ణువర్ధన్ రావు అరండల్‌పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తపేటలో చైన్ స్నాచింగ్

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్తపేట పోలీస్ పరిధిలోని కనుమూరు ఆసుపత్రి సమీపంలో గురువారం సాయంత్రం చైన్ స్నాచింగ్ జరిగింది. అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన అగంతకుడు ఆమె మెడలోని చైన్ తెంచుకొని ఉడాయించాడు. నిందితుడు కుగ్లర్ ఆసుపత్రి రోడ్డు వైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విచారణలో భాగంగా సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

క్రీడాకారులకు అల్పాహారం పంపిణీ

గుంటూరు(తూర్పు), మే 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు హాజరైన క్రీడాకారులకు, చిన్నారులకు రాష్ట్ర మైనార్టీ, టీడీపీ ప్రధాన కార్యదర్శి లాల్ వజీర్ అల్పాహారాన్ని పంపిణీ చేశారు. అయన మాట్లాడుతూ పేద, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్టేడియం వాకర్స్ లక్ష్మీ, శ్రీనివాస్, హరిబాబు, అబ్దుల్ ఖాదర్, సంధ్య, కమల తదితరులు పాల్గొన్నారు.

అంజనీ పుత్రా... అభయప్రదాతా

● వైభవంగా హనుమత్ జయంతి వేడుకలు

గుంటూరు(తూర్పు), మే 22(ఆంధ్రజ్యోతి): నగరంలో హనుమత్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయాల్లో జై శ్రీరామ్...జై హనుమాన్ నామస్మరణతో మారుమోగాయి.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

● స్థానిక ఏటుకూరు బైపాస్, శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు, హనుమత్ జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మహా పూర్ణాహుతి, అభయాంజనేయ స్వామికి ప్రత్యేక అలంకారంలో విశేషపూజలు జరిగాయి. ఉత్సవాల్లో టీడీపీ నాయకుడు, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి తదితరులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను అందుకొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన 79 కిలోల లడ్డు వేలంపాట జరిగింది. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకులు బండారు సాంబశివరావు పర్యవేక్షించారు.


సంపత్‌నగర్, శ్రీ రామనామక్షేత్రంలో..

● స్థానిక సంపత్‌నగర్, రామనామక్షేత్రంలో హనుమత్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పూజారులు శ్రీ ఆంజనేయస్వామికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.


ఆంజనేయస్వామికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

● గుంటూరు కార్పొరేషన్, మే 22(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలోని ఆంజనేయ స్వామి దేవ స్థానంలో హనుమత్ జయంతోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా మన్యసుక్త హోమం, మాలిక ద్రవ్యములతో, పాలాభిషేకాలతో స్వామివారికి సహస్ర ఘటాభిషేకం జరిపించారు. రాత్రి 9 గంటలకు శ్రీ సువర్చల ఆంజనేయ స్వామి వారి కల్యాణం జరిపించారు. కార్యక్రమాలు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర పర్యవేక్షణలో శ్రీ హనుమాన్ దీక్షా సమాజం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ హనుమాన్ దీక్షా సమాజం అధ్యక్షుడు తిరువళ్ళూరు వెంకట సుబ్బారావు, సభ్యులు నాగేశ్వరరావు, వంశీ ప్రసాద్, రమేష్, వెంకటరమణ, మారుతి, సుబ్రమణ్యం, బాపిరాజు పాల్గొన్నారు.

● స్థానిక మారుతీ నగర్ మారుతీ దేవాలయంలో స్వామి వారికి విశేష పూజలు, హోమాలు జరిగాయి. హనుమాన్ చాలీసా పారాయణలు, శ్రీ శారద రామలింగేశ్వర భజన సమాజం వారిచే భక్తి సంగీత విభావరీ ఆకట్టుకుంది. కార్యక్రమాల్ని ఆలయ కమిటీ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

● పాతగుంటూరు, విశాఖ శ్రీ శారదా పీఠ పరిపాలిత శ్రీ వీరాంజనే యస్వామి వారి దేవస్థానంలో హనుమత్ జయంత్సోవాల్లో భాగంగా ఉదయం 6గంటలకు ప్రభాతసేవ, ఆలయ ప్రదక్షణలు, మంత్ర పుష్పం, ప్రసాద వినియోగం చేశారు. అనంతరం వేదపండితులు పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పురావూరి బాబురావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు పర్యవేక్షించారు.

● గుంటూరు కార్పొరేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్‌లో గల శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో 30వ హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ కొల్లి బాలకృష్ణ దంపతులచే స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొల్లి అనిల్ కుమార్, సభ్యులు సత్యనారాయణ శాస్త్రి, కొత్తమాసు శ్రీమన్నారాయణ మూర్తి, కొల్లి అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

● నల్లచెరువు మెయిన్‌రోడ్డులోని శ్రీ సువర్చల ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ జరిపించింది. సాయంత్రం స్వామి రథోత్సవాన్ని నగర వీధుల్లో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడపా కొండలరావు, కార్యదర్శి శివరామకృష్ణ, కాశీ విశ్వనాథం, బి.శ్రీనివాసరావు, డి.కోటేశ్వరరావు, పాల్గొన్నారు.


పాత గుంటూరులో పర్యటిస్తున్న మేయర్, కమిషనర్, ఎమ్మెల్యే తదితరులు

నగరాన్ని క్లీన్ గ్రీన్‌గా తీర్చిదిద్దుకుందాం : మేయర్

గుంటూరు కార్పొరేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): వార్డుల వారీగా సమగ్ర పారిశుధ్య పనులను మెగా క్లీన్ ద్వారా చేపట్టి నగరాన్ని క్లీన్, గ్రీన్ నగరంగా తీర్చిదిద్దుకుందామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. స్థానిక 9, 10వ వార్డుల్లోని సుద్దపల్లి డొంక, యాదవుల బజార్, ఆలీ నగర్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ నసీర్‌తో కలిసి పర్యటించి మెగా క్లీన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ వారంలో రెండు వార్డులను ఎంపిక చేసుకొని మెగా క్లీన్ చేయడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోరిన విధంగా మణి హోటల్ సెంటర్ నుంచి బాలాజీ నగర్ రోడ్‌ని మాస్టర్ ప్లాన్ మేరకు 60 అడుగులకు విస్తరణ చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు.

కమిషనర్ మాట్లాడుతూ వార్డులో సాధారణంగా విధులు నిర్వహించే కార్మికులతో పాటు అదనంగా 225 మంది కార్మికులతో ప్రతి వీధిని, డ్రెయిన్లను శుభ్రం చేయడం, అనధికార హోర్డింగ్స్, బోర్డులు ఉంటే తొలగించడం జరుగుతుందన్నారు. పాత గుంటూరు ప్రాంతంలో నూతన డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు, డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ వార్డుల వారీగా పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించడం, మౌలిక వసతుల కల్పనను ఈ ప్రత్యేక డ్రైవ్‌లో చేపడతామన్నారు. క్షేత్ర స్థాయిలో కొందరు కార్యదర్శులు, సిబ్బంది విధుల్లో నిర్లిప్తంగా ఉంటున్నారని, అటువంటి వారు పని తీరు మార్చుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సిటి ప్లానర్ రాంబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి, కార్పొరేటర్లు యల్లావుల అశోక్ యాదవ్, ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, సంకూరి శ్రీనివాసరావు యాదవ్, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

సురక్షితమైన తాగునీరు ప్రజలందరి హక్కు

● ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): సురక్షితమైన తాగునీరు ప్రజలందరి హక్కు అని, దానిని గుర్తించి కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందిస్తోందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి చెప్పారు. గుంటూరు 25 డివిజన్ అధ్యక్షుడు గాలం వెంకటేశ్వర్లు నల్లపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు రూ.60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లో తాగునీటిని కేవలం రూ.5/- లకే 20 లీటర్లు అందించటం అభినందనీయమన్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తలు పలువురు కలిసి ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను కూడా ఆమె ప్రారంభించారు. కార్యకర్తలు స్వతహాగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి పలువురికి జీవనోపాధిని కల్పించటం అభినందనీయమన్నారు.

కార్యకర్తలకు అండగా జనసేనాని పవన్ కల్యాణ్

● మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి


హరిని అభినందిస్తున్న మంత్రి మనోహర్

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల బంగారు భవిష్యత్తు కోసం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఆవిర్భవించిన జనసేన పార్టీ సభ్యత్వం కలిగి ఉండటం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని జనసేన రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలు నాలుగు వందలు చేసిన సందర్భంగా జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరిని ఆయన అభినందించారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకొనే పవన్ కల్యాణ్, దేశంలో మరే ఇతర పార్టీలో లేని విధంగా జనసేన సభ్యత్వ నమోదుతో రూ. ఐదు లక్షల బీమా పాలసీని తెచ్చిన గొప్ప నేతగా మంత్రి నాదెండ్ల మనోహర్ అభివర్ణించారు.

జై హనుమా.. వీర హనుమా



యడ్లపాడు రణవీరాంజనేయస్వామి ఆలయంలోని స్వామివారికి వేద మంత్రోచ్ఛారణల మధ్య అభిషేకం నిర్వహిస్తున్న పండితులు



సత్తెనపల్లి: మహారాష్ట్ర వీధిలో భక్తాంజనేయ స్వామిని పూలతో అలంకరించిన దృశ్యం

హనుమత్ జయంతి వేడుకలు గురువారం వాడవాడలా వైభవంగా జరిగాయి. పట్టణాలు, పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల్లో జై శ్రీరామ్.. జై హనుమాన్.. వీర హనుమా.. నామస్మరణలతో మారుమోగాయి. ఆలయాల్లో వేకువజాము నుంచే స్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయాలు కిక్కిరిశాయి. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ, తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



తెనాలి గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠం నందు మామిడి పండ్లతో స్వామివారికి ప్రత్యేక పూజలు



వేమూరు మండలం జంపని వీరాంజనేయస్వామికి విశేష అలంకరణ చేసిన దృశ్యం

లైసెన్స్ ఉంటే.. లక్షలే



- మిర్చియార్డులో షాపు ప్రదేశాన్ని బట్టి రూ.20లక్షలు - రూ.50 లక్షల వరకు డిమాండ్
- లీజుకు ఇస్తే ఏడాదికి రూ.3లక్షల నుంచి రూ.5లక్షలు
- ఈ కారణంతోనే వాటికి విపరీతమైన డిమాండ్

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు(గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)లో కమీషన్ ఏజెంట్ లైసెన్సు పొందగలిగితే ఆ వ్యక్తి లక్షాధికారి అయినట్లే. ఇందుకు కారణం ఈ లైసెన్సుకు అంత డిమాండ్ ఉన్నది. లైసెన్సు మంజూరై యార్డులో దుకాణం మంజూరైతే దానిని ఉన్నపళంగా కొనుగోలు చేయడానికి బడా వ్యాపారస్థులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. షాపు కేటాయించిన ప్రదేశాన్ని బట్టి రూ.20 లక్షల నుంచి రూ.50లక్షల వరకు చెల్లించి తీసుకొంటారు. ఒకవేళ అమ్మడం ఇష్టం లేక సబ్‌లీజుకు ఇచ్చినా ఏడాదికి రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు తెచ్చి చేతిలో పెడతారు. దీంతో మిర్చియార్డుకు కొత్త పాలకవర్గం ఏర్పడిన ప్రతీసారి ఏదో ఒకవిధంగా మార్కెటింగ్ శాఖపై ఒత్తిడి/సిఫార్సులు చేయించుకొని కమిటీలోని సభ్యులు వేరే పేర్లతో లైసెన్సులు పొందుతుంటారు.

ఏఎంసీలో కమీషన్ ఏజెంట్ లైసెన్సులకు ఎల్లప్పుడూ డిమాండ్ విపరీతంగా ఉంటుంది. ఇందుకు కారణం కమీషన్ వ్యాపారి అనేక రూపాల్లో ఆదాయం పొందే అవకాశం ఉండటమే. ఒకసారి లైసెన్సు పొందితే రైతులు మిర్చియార్డుకు తీసుకొచ్చే మిరపకాయలను అమ్మిపెడితే అధికారికంగా 2 శాతం కమీషన్ వస్తుంది. అయితే అనధికారికంగా మరో రెండు నుంచి మూడు శాతం వరకు వ్యాపారస్థులు తీసుకొంటుంటారు. అలానే జీరో, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాల ద్వారా కూడా పెద్ద మొత్తంలోనే ఆదాయం సమకూరుతుంటుంది. ఈ నేపథ్యంలో లైసెన్సుపై పెట్టిన ఖర్చు అనతికాలంలోనే వెనకేసుకోవచ్చు. మిర్చి దిగుమతులు ఇటీవల కాలంలో గణనీయంగా పెరిగినందున యార్డులో ప్రస్తుతం ఉన్న 665 కమీషన్ ఏజంట్‌లు లావాదేవీలు చేయలేకపోతున్నారు. అసలు ప్రస్తుతం 30 ఎకరాల్లో ఉన్న యార్డు ప్రాంగణమే సీజన్‌లో సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో కొత్త యార్డుని ఎక్కడైనా 100 ఎకరాల్లో ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉన్నది. దీంతో అధికారంలో ఎవరుంటే వాళ్ల కొత్త కమీషన్ ఏజంట్ లైసెన్సుల పొందేందుకు ప్రయత్నిస్తుంటారు.

కాగా పాలకవర్గం ద్వారా ఎప్పటికప్పుడు కొత్త లైసెన్సుల మంజూరు కోసం ప్రతిపాదనలు రూపొందించి ఆమోదం కోసం మార్కెటింగ్ శాఖ కమిషనరేట్‌కు పంపుతుంటారు. మార్కెటింగ్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆమోదముద్ర పడితే లైసెన్సు మంజూరైనట్లే. అయితే కొత్త లైసెన్సుల విషయంలో పెద్దఎత్తున అవినీతి జరుగుతుందని ఆరోపణలు వస్తుండటంతో మార్కెటింగ్ శాఖ రాష్ట్ర అధికారులు మిర్చియార్డు నుంచి నడుపుతున్న ఫైళ్లను పక్కన పెడుతున్నారు. ఇప్పుడు కొత్తగా 30 లైసెన్సుల వరకు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇదే సమయంలో గతంలో పక్కన పెట్టిన ఫైళ్ల దుమ్ము కూడా దులిపించి వాటిని మంజూరు చేయాల్సిందిగా కొంత మంది ఒత్తిడి చేస్తున్నారు. ఇవికనుక కార్యరూపం దాలిస్తే మరో స్కామ్‌కి యార్డు కేంద్ర బిందువు కానుంది.

మళ్లీ తెరపైకి క్లస్టర్లు



- అధికారులందరూ అందుబాటులో ఉండేలా విభజన
- గత ఐదేళ్లు సచివాలయాలతో పాలనకు ఇబ్బందులు

పిడుగురాళ్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా సౌలభ్యం కొరకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను ప్రజల్లోకి త్వరితగతిన తీసుకెళ్లేందుకు ప్రభుత్వం క్లస్టర్లను తెరపైకి తీసుకొచ్చింది. 2014-19 మధ్య గ్రామ పంచాయతీలను క్లస్టర్లుగా విభజన చేసి పరిపాలనను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పంచాయతీలలో సచివాలయాల ఏర్పాటు చేసి ఉద్యోగులను నియమించింది. సచివాలయాల ఉద్యోగుల బదిలీలు, డిప్యుటేషన్‌లతో పాటు పరిపాలన సౌలభ్యంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మరలా క్లస్టర్లను తెరపైకి తీసుకొచ్చింది. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాలను క్లస్టర్లుగా విభజించాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయాలను క్లస్టర్లుగా విభజిస్తూ అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. గురజాల నియోజకవర్గం వరకు చూస్తే గురజాల మండలంలో 8, దాచేపల్లి మండలంలో 7, మాచవరం మండలంలో 7, పిడుగురాళ్ల మండలంలో 7 చొప్పున క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇదేవిధంగా అన్ని మండలాల పరిధిలోనూ పంచాయతీలను క్లస్టర్లుగా విభజించనున్నారు. ఈ క్రమంలో ప్రతీ క్లస్టర్‌లోనూ ఒక వీఆర్వో, హెల్త్ అసిస్టెంట్, వ్యవసాయశాఖ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తప్పనిసరిగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సచివాలయాల్లో అయితే పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉండాల్సి వుంది. క్లస్టర్‌కు కేటాయించిన అధికారులు, సచివాలయాలకు కేటాయించిన అధికారులు ఇద్దరూ సమన్వయంతో పనిచేయాలి. ఇప్పటి వరకు సచివాలయాల వ్యవస్థతో ఒక్కో సచివాలయంలో ఒక్కో వీఆర్వో, హెల్త్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ సెక్రటరి, ఎడ్యుకేషనల్ సెక్రటరితో పాటు 11 మంది ఉన్నారు. క్లస్టర్ల ఏర్పాటుతో వీఆర్వోలతో పాటు కొన్నిశాఖల అధికారుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.



ట్రాక్టర్లతో నీటిని తోడుతున్న దృశ్యం

ఐకానిక్ పనులకు ఆటంకాలు

- అకాల వర్షాలతో పునాదుల్లోకి నీరు
- వచ్చిన నీటిని వచ్చినట్లు తోడుతున్న కార్మికులు
- 30కి పైగా ట్రాక్టర్లతో భారీస్థాయిలో నీటి తోడకం
- కిందటేడాది డిసెంబరులోనే తోడేసిన ప్రభుత్వం
- తాజా వర్షాల కారణంగా మరోమారు తోడాల్సిన పరిస్థితి

గుంటూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఐకానిక్ సెక్రటేరియట్ టవర్ల పనులు ముమ్మరంగా సాగుతుండగా అకాల వర్షాలు ఆటంకపరుస్తున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2న రాజధాని నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించడంతో ఐకానిక్ టవర్ల వద్ద కూడా పనులు ప్రారంభమయ్యాయి. అసెంబ్లీకి సంబంధించి మెజర్మెంట్స్ పనులు జరుగుతుండగా, సెక్రటేరియట్ పనులు పదిరోజులుగా సాగుతున్నాయి. అయితే వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు పనులను ఆటంక పరుస్తున్నాయి. అకాల వర్షాలతో పునాదుల్లోకి నీరు చేరడంతో నీటిని తోడడమే ప్రధాన పనిగా మారిపోయింది. దీంతో అసలు పని ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. సెక్రటేరియట్ భవన సముదాయం నిర్మాణంలో భాగంగా ఐదు టవర్లు నిర్మిస్తున్నారు. ఈ ఐదు టవర్ల దగ్గర 30కి పైగా ట్రాక్టర్లను పెట్టి భారీ పైపులతో నీటిని తోడుతున్నారు. తోడిన నీటిని పెద్దపెద్ద గండ్లు కొట్టి వాగుల్లోకి మరలిస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు ఆగిపోయిన రాష్ట్ర సచివాలయం శాశ్వత భవన సముదాయాల వద్ద గత ప్రభుత్వ హయాంలో భారీగా నీరు చేరింది. ఆ నీటిని కూటమి ప్రభుత్వం వచ్చాక కిందటేడాది డిసెంబరు 27న తోడించారు. ఆ వెంటనే పనులు ప్రారంభం కాకపోవడంతో మళ్లీ పునాదుల్లోకి స్వల్పంగా నీరు చేరింది. అది పనులకు పెద్ద సమస్య కాలేదు. అయితే తాజాగా కురిసిన వర్షాలతో వరద నీరు, ఊట పెరిగి పునాదుల్లోకి నీరు భారీగా వచ్చింది. ఆ నీటిని తోడే పనులు రెండు రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే బుధవారం రాత్రి కురిసిన వర్షంతో మళ్లీ పునాదుల్లో నీరు చేరాయి. దీంతో మళ్లీ గురువారం నీరు తోడుతున్నారు. దాదాపు ఒక బిల్డింగ్ వద్ద నీరు తోడకం పూర్తవగా మిగిలిన నాలుగు టవర్ల వద్ద నీటి తోడకం పనులు వేగంగా జరుగుతున్నాయి.

సీడ్ యాక్సెస్ రోడ్డులో పోలీస్ మాక్ డ్రిల్

- నిరంతరం పటిష్టమైన భద్రత: డీఎస్పీ మురళీ కృష్ణ

తుళ్లూరు, మే 22(ఆంధ్రజ్యోతి): వీవీఐపీలు, వీఐపీలు ప్రయాణించే రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడానికి గుంటూరు జిల్లా భద్రతా విభాగం ఆధ్వర్యంలో సీడ్ యాక్సెస్ రోడ్డు మీద గురువారం ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఎస్పీ మురళీ కృష్ణ, డీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఐ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. భద్రతా విభాగ పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. భద్రతా సిబ్బంది తమ వద్ద ఉన్న ఆధునిక సాంకేతిక భద్రతా పరికరాలు, శిక్షణ పొందిన జాగిలాలతో మంతెన సత్యనారాయణ ఆశ్రమం సీడ్‌యాక్సెస్ రోడ్డు మొదలుకొని ఎన్-9 రోడ్డు జంక్షన్ వరకు డివైడర్లు, చెట్ల పొదలు, పూల మొక్కల పాదులు, రోడ్డు కిరువైపులా ఉన్న కల్వర్టులు, వంతెనలు, తూములు తదితర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. భద్రతా తనిఖీలు కచ్చితత్వాన్ని పరీక్షించటానికి, జాగిలాల పని తీరుని అంచనా వేయడానికి సీడ్ యాక్సెస్ రోడ్డులోని ఒకచోట పేలుడు పదార్థాన్ని గోప్యంగా పెట్టారు. బాంబు డిస్పోజల్ విభాగానికి చెందిన ఒకజాగిలం చాకచక్యంగా సదరు పేలుడు పదార్థాన్ని కనిపెట్టింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ(ఏఆర్) హనుమంతు మాట్లాడుతూ, తనిఖీలు కచ్చితత్వాన్ని, భద్రతా ప్రమాణాలు మెరుగు పరచడానికి ఈ మాక్‌డ్రిల్ నిర్వహించినట్టు చెప్పారు. బీడీ టీం భద్రతా సిబ్బంది అన్నీ ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరిన్ని తనిఖీలు(మాక్ డ్రిల్) నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ, సీడ్ యాక్సెస్ రోడ్డు వెంబడి ఎటువంటి ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పోలీస్ అధికారులు, సిబ్బంది పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీడీ టీం సహకారం, సమన్వయంతో భద్రతా ప్రమాణాలు మెరుగుపరుస్తున్నట్టు చెప్పారు. రాజధానిలో భద్రతతో పాటు నిర్మాణ పనులు చేయటానికి వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికుల వివరాలను కూడా సేకరిస్తున్నామని, అన్ని దిశల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు సీఐ కొంకా శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరావు, ఎస్బీ సీఐ శ్రీహరి, జిల్లా భద్రతా విభాగ ఆర్‌ఐ ఉమేష్, పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జాగిలం కనిపెట్టిన పేలుడు పదార్థాలు పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ, అధికారులు



మాక్‌డ్రిల్‌లో భాగంగా పోలీసు జాగిలంతో సీడ్ యాక్సెస్ రోడ్డులో తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బంది

రేషన్ కార్డుదారులకు అసౌకర్యం కలగరాదు

- డీలర్లతో పౌరసరఫరాల మంత్రి మనోహర్

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని 972 రేషన్ దుకాణాల్లో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి సరుకుల పంపిణీని డీలర్లు ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో తాడేపల్లిలోని కార్యాలయంలో సమావేశమై చర్చించారు. రేషన్ సరుకుల పంపిణీ సందర్భంగా కార్డుదారులకు ఎలాంటి అసౌకర్యం కలగరాదన్నారు. నిత్యం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు షాపులు తెరిచి సరుకులు పంపిణీ చేయాలన్నారు. కచ్చితమైన తూకంతో సరుకులు కార్డుదారులకు ఇవ్వాలన్నారు. అలానే ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మాత్రమే వసూలు చేయాలన్నారు. దివ్యాంగులు, 60 ఏళ్ల వయస్సు పైబడిన వారికి రేషన్‌షాపు దుకాణాదారుడు నేరుగా వారి ఇంటి వద్దకే సరుకులు చేర్చాలన్నారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థకు టీడీపీ ప్రభుత్వం పునరుజ్జీవం కల్పించిందన్నారు. రేషన్ పంపిణీని పారదర్శకంగా చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వంగపాటి అంజయ్య, గుంటూరు నగర అధ్యక్షుడు తుమ్మల గాంధీ, కార్యదర్శి జిలాని, కార్యవర్గ సభ్యుడు కిశోర్ పాల్గొన్నారు.

బర్లీ పొగాకు కొనుగోళ్లపై కార్యాచరణ

పర్చూరు, మే 22(ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రైతులను అదుకునేందుకు వారివద్ద ఉన్న నిల్వలను కొనుగోలు చేసేందుకు దృష్టిసారించింది. మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడుతో ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ కమిటీ క్షేత్రస్థాయిలో పర్యటించనుంది. దీనిలో భాగంగా ఈ నెల 24న మార్టూరు మండలం ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయానికి మంత్రుల బృందం రానున్నది. మంత్రులతోపాటు, పలువురు ఎమ్మెల్యేలు, వ్యవసాయశాఖ అధికారులు, మార్క్‌ఫెడ్, పొగాకు బోర్డు అధికారులు, కంపెనీల ప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నారు. మంత్రులు అధికారులు, కంపెనీ ప్రతినిధులతో చర్చించాక కొనుగోళ్లపై కార్యాచణ ప్రణాళిక రూపొందించనున్నారు.

ప్రతి రైతుకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా రైతుల మేలు కోరుతూ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతుల వద్ద ఎంతమేర బర్లీ పొగాకు ఉంది అన్న అంశంపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రిఫరెన్షియల్ కేటగిరి ఉపాధ్యాయులకు వైద్య శిబిరం

గుంటూరు(విద్య), మే 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్‌లో శుక్రవారం ప్రిఫరెన్షియల్ కేటగిరి ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు డీఈవో రేణుక గురువారం తెలిపారు. ఓపెన్ హార్ట్ సర్జరీ, కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. గత నెలలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొన్న వారు తాజాగా ఏర్పాటు చేసిన శిబిరంలో పాల్గొనేందుకు అనర్హులన్నారు. నిబంధనల విరుద్ధంగా తాజాగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొంటే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు

దాత ఇచ్చిన ఆస్తిని కాపాడేందుకు 18 ఏళ్ల న్యాయ పోరాటం

- మూడు కోర్టులలో అనుకూలంగా తీర్పు
- పట్టువీడని బుర్రిపాలెం గ్రామస్థులు

తెనాలి అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): బాటసారుల కోసం దాత ఇచ్చిన ఆస్తిపై కన్నుపడిన అక్రమార్కుల చెర నుండి కాపాడేందుకు 18 ఏళ్ల న్యాయ పోరాటం చేశారు. మూడు కోర్టులలో అనుకూలంగా తీర్పు వచ్చే వరకు బుర్రిపాలెం గ్రామస్తులు తమ పట్టు వీడలేదు. ఎట్టకేలకు దాత ఆశయం నెరవేర్చారు. వివరాల్లోకి వెళితే.. రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన పరుచూరి సుబ్బయ్య అనే రైతు బాటసారుల విశ్రాంతి కోసం తెనాలి-చిలుమూరు మార్గంలో ప్రధాన రహదారి వెంట నాలుగు సెంట్ల స్థలం విరాళం ఇచ్చి బావి, పెంకుటిల్లు ఏర్పాటుచేశారు. విశ్రాంతి భవనంగా ఆ మార్గంలో బాటసారులకు ఎన్నో ఏళ్ల సేవలు అందించారు. ఈ భవన నిర్వహణకు అదే మార్గంలోని 52 సెంట్ల మాగాణి భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ ఆస్తిని కాపాడి బాటసారులకు ఉపయోగపడే విధంగా ఉండేందుకుగాను విక్రయ హక్కులు లేకుండా ఐదుగురు గ్రామస్తులను ట్రస్టీగా ఏర్పాటుచేశారు. వారు మరణించినా వారి సంతతి కమిటీగా కొనసాగేలా రాసి రిజిస్టర్ చేశారు. 2007లో కమిటీలోని ఒకరి కుమారుడు 52 సెంట్ల భూమిని విక్రయించేందుకు రెండు చేతులు మార్చాడు. ఇది గమనించిన ట్రస్ట్ సభ్యులు పరుచూరి రాంబాబు, బోసు దాత ఆస్తిని కాపాడేందుకు నడుం కట్టారు. తెనాలి కోర్టులో దావా వేశారు. ఈ అక్రమ వ్యవహారాన్ని 2009లో ఆంధ్రజ్యోతి కథనం కూడా ప్రచురించింది. తెనాలి కోర్టులో అనుకూలంగా తీర్పు రాగా, అక్రమార్కులు జిల్లా కోర్టు, హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా ట్రస్ట్ సభ్యులు న్యాయపోరాటం కొనసాగించారు. ఈ కోర్టులలో దాత ఆస్తిని కాపాడేలా ప్రముఖ సీనియర్ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు ఎలాంటి ఫీజు తీసుకోకుండా ఉచితంగా వాదించి వారికి సాయం అందించారు. బాటసారుల కోసం ఇచ్చిన దాత ఆస్తిని కాపాడేందుకు ఏళ్ల తరబడి న్యాయ పోరాటం చేసిన వీరిని గ్రామస్తులతో పాటు పలువురు అభినందిస్తున్నారు.



బాటసారుల కోసం ఏర్పాటు చేసిన వసతి



దాత ఇచ్చిన 52 సెంట్ల భూమి

గుంటూరు రూరల్ వార్తలు

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 1195 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.10,750, మోడల్‌ధర రూ.10,550 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,000, గరిష్ఠధర రూ.10,750 మోడల్‌ధర రూ.10,550 పలికాయి.

పొగాకు నిల్వల పరిశీలన



పొగాకు నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ రామకోటేశ్వరి, ఏవో కిరణ్మయి తదితరులు

కాకుమాను, మే 22(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా రైతులు సాగు చేసిన పొగాకు నిల్వలను పొన్నూరు సబ్ డివిజన్ ఏడీఏ రామకోటేశ్వరి, మండల వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి కలసి పరిశీలించారు. మండల పరిధిలోని కొమ్మూరు, గార్లపాడు, కొండపాటూరు, పెద్దివారిపాలెం, కాకుమాను గ్రామాల్లో రైతు సేవాకేంద్రాల సిబ్బంది కలసి గురువారం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిశీలించి నివేదికలను ఉన్నతాదికారులకు అందజేయనున్నట్లు ఏడీఏ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు గోపినాథ్, షేక్ మహారాజ్ సుల్తానా, శివ ప్రసాద్, యువకిషోర్, మహేంద్ర నాయక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

తాడేపల్లి (ఉండవల్లి), మే 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ గుంటూరు జిల్లా సహకారంతో స్థానిక మారుతీ మహిళా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉండవల్లి సెంటర్ నులకపేటలో కళాజాత నిర్వహించారు. ఈ బృందాలు వీధినాటకాల ద్వారా హెచ్‌ఐవీపై అవగాహన నిర్వహించారు. నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు శాంతికుమారి, ఎల్‌టీ రాఘవేంద్ర, సేవా సంస్థ ప్రాజెక్టు మేనేజర్ గంగాభవాని, ఏఎన్ఎం ప్రత్యూష, సిబ్బంది పాల్గొన్నారు.

తాడికొండలో భారీ వర్షం



నీటిలో మునిగిన తాడికొండలోని చెన్న మల్లికార్జున ఆలయం

తాడికొండ, మే 22(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. తాడికొండ గ్రామంలో చెంచుకాలనీ, ఎస్సీ కాలనీ, మైనార్టీ కాలనీ, స్వరాజ్‌నగర్ ప్రాంతాల్లో రహదారుల్లో నీరు చేరి చిత్తడిగా తయారవుతున్నాయి. స్వరాజ్ నగర్‌లోని శ్రీవీర చెన్న మల్లికార్జున ఆలయం చుట్టు వర్షం నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఆలయం చుట్టు పక్కల కాల్వల్లో పూడికతీతలు తీయకపోవటం వల్ల వర్షం నీరు ఆలయం చుట్టూ నిలబడిపోతున్నాయి. మండల గ్రామాల్లోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు లేకపోవటంతో బురద మయం అయిన రోడ్ల మీద నడవాలంటేనే నరకయాతన పడాల్సి వస్తుంది. అంతేకాకుండా మురుకాల్వల్లో పూడికలు తీయనందనే సమస్య ఎక్కువగా ఉంటుందని ఆయా గ్రామ ప్రజలు వాపోతున్నారు. బురద రోడ్లపై వాహనదారులు వాహనాలను నడపటానికి తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయాలని ఆయా గ్రామస్థులు కోరుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాపతినిధులు స్పందించి సీసీ రోడ్లు వేయాలని కోరుకుంటున్నారు. గ్రామాల్లోని సైడ్‌కాల్వల్లో మురుగును తీసివేయాలని కోరుకుంటున్నారు.

విద్యామిత్ర కిట్‌ల స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రత్తిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే పాఠ్య పుస్తకాల కిట్స్ పాయింట్‌ను సర్వశిక్షా అభియాన్ ఏపీసీ ఐ పద్మావతి పరిశీలించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్‌లను ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిల్వ ఉంచారు. ఈ స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లను ఆమె పరిశీలించారు. పాఠశాల ప్రారంభమయ్యే మొదటి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు.

గాలి వీచినా.. చినుకు పడినా.. వెతలే

- ఐదు గ్రామాల్లో తరచూ విద్యుత్ కోతలు
- చీకట్లోనే పల్లెలు.. రాత్రంతా జాగారం
- కరెంట్ ఎప్పుడు పోతోందో తెలియని వైనం
- ఎండవేడిమి, ఉక్కపోతతో జనం విలవిల
- చోద్యం చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



ముళ్లపొదల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



పొలాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

పెదనందిపాడు, మే 22(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా మండలంలోని ఐదు గ్రామాల్లో అప్రటికత విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. కొద్దిపాటి గాలులు వీచినా, వర్షం కురిసినా వెంటనే విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీంతో గ్రామాలు చీకట్లోనే ఉండాల్సి వస్తోంది. రాత్రంతా పల్లెవాసులు జాగారం చేయాల్సిన వస్తోంది. విద్యుత్ ఎప్పుడు వస్తుందో తెలియక ఇళ్లల్లో ఉన్న ప్రజలు ఇటు ఎండకు, అటు ఉక్కపోతకు విలవిల్లాడుతున్నారు. మండలపరిధిలోని రాజుపాలెం, పాలపర్రు, అన్నవరం, కొప్పర్రు గ్రామాలకు వెళ్లే విద్యుత్ లైన్లను నల్లమడ వాగు కట్టల అంచున, పొలాల్లో విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేశారు, ట్రాన్స్‌ఫార్మర్‌లను సైతం ఆకట్టలపైనే ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ర్మర్ల చుట్టూ ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి. కొద్దిపాటి వర్షాలు కురిసినా, ఈదురు గాలులు వీచినా విద్యుత్ స్థంభాలు నేలకొరిగి, విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వీటిని మరలా ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని ఆరోపిస్తున్నారు. అధికారులు నెలలో ఒక శనివారం విద్యుత్ మరమ్మతు ల పేరుతో సరఫరా నిలిపివేస్తారు, కానీ ఈ ప్రాంతంలో మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవని, మరమ్మతులు చేసి ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదని వాపోతున్నారు. మూడు రోజులుగా సాయంత్రం 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో తాగునీటికి సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ సమస్యను పరిష్కరించేందుకు పెదనందిపాడు - చిలకలూరిపేట ప్రధాన రహదారి వెంట విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఈ పనులను నిలిపివేయడంతో ఆ గ్రామాల్లో కరెంటు వెతలు వర్ణనాతీతంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి సారించి శాశ్వతంగా నూతన లైన్లు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్నాం

- గద్దె సావిత్రి, అన్నవరం



కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్నాం. ఎప్పుడు కరెంటు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. దీంతో తాగునీరు, వాడుకొనే నీటికి ఇబ్బంది పడుతున్నాం సమస్యను పరిష్కరించాలి.

ప్రత్యేక విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేయాలి

- లావు నాగేశ్వరరావు, పాలపర్రు



మా గ్రామానికి ప్రత్యేక విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి కరెంటు వెతలు తీర్చాలి. వేళాపాళా లేని విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

విజయకీలాద్రిలో హనుమత్ జయంతి



విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లి టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు చిన్నజీయర్ స్వామి వారి మంగళశాసనాలతో విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో హనుమత్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకం సకల కార్యసిద్ధి మనోభీష్టి సిద్ధి కోసం మన్యుసూక్త హోమం, వడమాల సేవ, తమలపాకులతో అర్చన మంగళశాసనం, తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలు జరిగాయి. చిన్న జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, రఘునాథాచార్యులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

● తాడేపల్లి పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గురువారం హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సీతానగరం శ్రీమద్వీరాంజనేయ సమేత కోదండరామాలయంలో స్వయంభువుగా విరాజిల్లుతున్న స్వామివారికి ఉదయం పంచామృతములు, పళ్ల రసాలతో అభిషేకాలు, అగ్ని ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు మారుతీ ఆచార్యులు, సుప్రకాష్‌శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ జయంతి ఉత్సవాలు

- పలు చోట్ల భారీగా అన్నదానం
- ఘనంగా స్వామి గ్రామోత్సవాలు



సొపాడులో ఆంజనేయ స్వామి



అనంతవరప్పాడులో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మాదల చైతన్య

వట్టిచెరుకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లోని కోదండరామాలయాలు, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో గురువారం భక్తి శ్రద్ధలతో హనుమత్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా మండలంలోని సొపాడు, పుల్లడిగుంట, వింజనంపాడు, వట్టిచెరుకూరు, ముట్లూరు, లేమల్లెపాడు, అనంతవరప్పాడు గ్రామాల్లోని ఆయా ఆలయాల పూజారులు గురువారం తెల్లవారుజాము నుంచే వేద మంత్రాలతో పాటు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసి పోయాయి. అలాగే ఆయా దేవాలయాల్లో మహిళలు హనుమాన్ చాలిసా పారాయణాలను నిర్వహించారు. సొపాడులో బొమ్మిడాల కుటుంబీకులు, గ్రామస్థులు, ముట్లూరు గ్రామంలోని పట్టాభి రామస్వామి, లక్ష్మీ చెన్నవ కేశవ స్వామి ఆలయాలు, పుల్లడిగుంటలోని సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలను అన్నదాన కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.

జన చైతన్య ప్రాపర్టీస్ శ్రేష్ఠ గ్రూపు ఆధ్వర్యంలో

అనంతవరప్పాడు గ్రామంలోని ప్రసన్నాంజ నేయ స్వామి దేవాలయంలో గురువారం జన చైతన్య ప్రాపర్టీస్ శ్రేష్ఠ గ్రూపు చైర్మన్ మాదల చైతన్య ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని చైతన్య ప్రారంభించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రి లోకేశ్‌లు ఆయురారోగ్యాలతో ఉండాలని చైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏటుకూరులో ఘనంగా ప్రత్యేక పూజలు

- అన్న సంతర్పణ చేసిన తులసీ రామచంద్రప్రభు



అన్న ప్రసాద వితరణను ప్రారంభిస్తున్న తులసీ రామచంద్రప్రభు

గుంటూరు, మే 22(ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ పరిధిలోని ఏటుకూరులో శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. తులసీ గ్రూపు సంస్థల అధినేత తులసీ రామచంద్ర ప్రభు కుటుంబ సమేతంగా హాజరై విశేష ద్రవ్యాలతో శ్రీఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు ఉగ్గిరాల సీతారామయ్య ఆధ్వర్యంలో మేళతాళాలతో, కోలాటం మాస్టర్ నాగం రేణుకాదేవి అండ్ టీం కోలాటం, నృత్యాలతో ఉత్సవాలు జరిపారు. కర్రసాము గురువులు జిడుగు సుబ్బారావు, వర్మ, వెంకట్‌ల ఆధ్వర్యంలో 60 మంది కళాకారులతో విన్యాసాలు చేశారు. ఈ ప్రదర్శనలు వీక్షకులకు కనులవిందు చేశాయి. స్వామి వారి సన్నిధిలో 15వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని తులసి రామచంద్రప్రభు ప్రారంభించారు. కర్రసాము ప్రదర్శన అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. నెల రోజుల నుంచి స్థానిక కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ, వాసు గార్ల ఆధ్వర్యంలో కర్రసాము, కోలాటాల బృందాలకు కావాలసిన ఏర్పాట్లు చేశారు. 18 సంవత్సరాలుగా ఈ హనుమాన్ జయంతి వేడుకలకు సహకరిస్తున్న తులసి రామచంద్ర ప్రభుని కమిటీ వారు శాలువాతో సత్కరించారు.

దాసాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



దాసాంజనేయ స్వామిని దర్శించుకున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతి సందర్భంగా గౌతమబుద్ధ రోడ్డులోని ఎర్రచెరువు వద్ద ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ఆంజనేయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. హనుమజ్జయంతి సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్న సంతర్పణ గావించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీరావు, తాడేపల్లి మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, నేతలు గంజి చిరంజీవి, బల్లా ఉమామహేశ్వరరావు, చిట్టెం అవినాష్, బత్తినేని అంజయ్య, కోలా భాగ్యా రావు, సాయినందన్, పావని, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, రాజేశ్వరీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత ఇంధన వినియోగం పెరగాలి

- ఈవీ చార్జింగ్ సొల్యూషన్‌లను ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కొండపల్లి శ్రీనివాస్, కంపెనీ ప్రతినిధులు

తాడేపల్లి టౌన్, మే 22 (ఆంధ్ర జ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పరిశుభ్రమైన పర్యావరణహిత ఇంధనాన్ని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి డాక్టర్ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. భవిష్యత్ విద్యుత్ వాహనాలదేనని వాటిని ప్రోత్సహించేందుకు సబ్సిడీలు, రాయితీలతోపాటుగా అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు. తాడేపల్లి పరిధిలోని విజయవాడ క్లబ్‌లో గురువారం ప్రముఖ విద్యుత్ వాహనాల ఉత్పత్తుల తయారీ సంస్థ డీజేటీ హైకా ఆధ్వ ర్యంలోని అధునాత ఈవీ చార్జింగ్ మౌలిక సదుపాయాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశుభ్రమైన, స్థిరమైన రవాణాను ప్రోత్సహించే దిశగా ఇది ఒక అద్భుతమైన అడుగు అన్నారు. కార్యక్రమంలో డీజేటీ హైకా వ్యవస్థాపకులు సంజయ్‌కుమార్, నిర్మల ఎంటర్ ప్రైజెస్ అధినేత యడ్ల పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులపై ఆంక్షలు విధించడం సరికాదు

- ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి

మంగళగిరి సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): దేశ పురోభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న సహకార బ్యాంకులపై భారతీయ రిజర్వు బ్యాంకు నిబంధనల పేరిట ఆంక్షలు విధించడం సరికాదని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు మంగళగిరి శాఖ సభ్యుల మహాసభ స్థానిక ఈద్గా కమ్యూనిటీ హాల్లో గురువారం జరిగింది. పీవీ వెంకట రమణారావు అధ్యక్షతన జరిగిన సభలో సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రిజర్వు బ్యాంకు ఆంక్షల వల్ల సహకార బ్యాంకులు నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి వాటిని తిరిగి సామాన్య ప్రజలకు రుణాల రూపంలో అందజేసి వాటి ద్వారా వచ్చే లాభాలను ఎటువంటి లాభాపేక్ష లేకుండా తిరిగి సభ్యులకే పంచుతున్న ఘనత ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకుకే దక్కుతుందని చెప్పారు. ఐక్యరాజ్య సమితి ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించడం సహకార రంగం ప్రాధాన్యాన్ని తెలియజేస్తుందన్నారు. బ్యాంకు డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు మాట్లాడుతూ సాధారణ ప్రజలకు, చిరువ్యాపారులకు, స్వయం ఉపాధి పొందుతున్న వారికి విద్య, వైద్య రంగాల అభివృద్ధికి, వృత్తిదారులకు వివిధ రకాల రుణాలను అందిస్తుందని తెలిపారు. ఈ మహాసభలో బ్యాంకు డైరెక్టర్ నన్నపనేని అంజయ్య, జోనల్ మేనేజర్ ఎన్ఎస్ఆర్ మూర్తి, బ్రాంచి మేనేజరు రవిశంకర్, బత్తూరి మోహనరావు, వెంకటస్వామి, పిల్లలమర్రి నాగగేశ్వరరావు, బత్తుల గిరి తదితరులు పాల్గొన్నారు.

రావిపాడు టీడీపీ అధ్యక్షుడిగా కొమ్మినేని



గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహిస్తున్న దామచర్ల శ్రీనివాసరావు

పెదనందిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోగులమూడి, రావిపాడు గ్రామాల్లో గురువారం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక జరిగింది. ఎన్నికల పరిశీలకులుగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దామచర్ల శ్రీనివాసరావు, మొవ్వా వేణులు గ్రామంలోని టీడీపీ నాయకుల నుంచి వివరాలు సేకరించి తగు సూచనలు సలహాలు తీసుకొని కమిటీ సభ్యుల వివరాలను నియోజకవర్గ కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కమిటీని ప్రకటిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చుండూరు శ్రీలత, ఆయా గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యనమదల అధ్యక్షుడిగా వీరయ్య ఏకగ్రీవం



యనమదల గ్రామ కమిటీని అభినందిస్తున్న నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవి, మండల నాయకులు

ప్రత్తిపాడు, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని యనమదల తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడిగా పావులూరి వీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవి సమక్షంలో మండల అధ్యక్షుడు గింజుపల్లి శివ రామప్రసాద్ ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పార్టీ నాయకత్వం మొత్తం వీరయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ముద్రబోయిన శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీగా యక్కల వెంకట్రావు, సెక్రటరీగా జొన్నలగడ్డ దాసు, కొత్తమాసు శ్రీనివాసరావు, కొండా శ్రీనివాసరావు, గుంటూరు రామారావు, కంచర్ల మల్లి ఖార్జునరావు, కోశాధికారిగా లక్ష్మీనారాయణలను ఎన్నుకున్నారు. ఎన్నికైన కమిటీని నియోజకవర్గ పరిశీలకురాలు వందనాదేవితో పాటు మండల నాయకులు అభినందించారు.

26న చలపతి ఫార్మసీలో మెగా జాబ్ మేళా



జాబ్ మేళా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీ ఆంజనేయులు

తాడికొండ(లాం), మే 22 (ఆంధ్రజ్యోతి): లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ఈ నెల 26వ తేదీన ఫార్మా కంపెనీలు మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు పేర్కొన్నారు. గురువారం కళాశాలలో జాబ్‌మేళా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ ఫార్మా కంపెనీలు అయిన నాట్కో, హెటిరో, అరబిందోలు జాబ్ మేళాల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. జాబ్ మేళాకు బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీఎస్సీ, ఎంఎస్సీ డిప్లమా, ఐటీఐ, డిగ్రీ చదవిన విద్యార్థులు అర్హులని తెలిపారు. అర్హులైన తమ బయోడేటా, విద్యా సంబంధిత సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. స్క్రీనింగ్, ఇంటర్వ్యూలు, టెక్నికల్ రౌండ్లు నిర్వహిస్తారన్నారు. జాబ్ మేళా ద్వారా ఫార్మా రంగం, సైన్స్ రంగం, టెక్నికల్ రంగాల్లో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలతో రైతుల నడ్డి విరుస్తున్న కేంద్రం

- సీపీఐ నేత జంగాల అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

మంగళగిరి, మే 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశం తిరోగమనంలో పయనిస్తుందని, నల్ల చట్టాలను తీసుకువచ్చి కార్మికులు, రైతుల నడ్డి విరుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ ధ్వజమెత్తారు. మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామ సీపీఐ శాఖ మహాసభ దారా గురునాథం అధ్యక్షతన గురువారం జరిగింది. అజయ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ విధానాల వల్ల దేశం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. నిరుద్యోగులకు రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి యువతను దారుణంగా మోసం చేశారని, అన్నం పెట్టే రైతులను, శారీరక శ్రమ చేసుకునే కార్మికులను నట్టేటా ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సంపదను గుజరాతీ పెత్తందార్లకు, పెట్టుబడిదార్లకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి అప్పులు కాకుండా గ్రాంటు రూపంలో నిధులు కేటాయించి నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని కోరారు. సీపీఐ జిల్లా మహాసభలు ఆగస్టు 4, 5 తేదీల్లో గుంటూరులోను, రాష్ట్ర మహాసభలో ఆగస్టు 22, 23, 24 తేదీల్లో ఒంగోలులోను, జాతీయ మహాసభలో సెప్టెంబరులో పంజాబ్‌లోని చండీఘర్‌లోను జరుగుతాయని తెలిపారు. ఈ మహాసభలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నేతలు కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, మేడా హనుమంతరావు, పంతగాని మరియదాసు, వెంగల వెంకటేశ్వరరావు, నవీన్, కాబోతు ఈశ్వరరావు, కాగితాల నాగభూషణం, ఆర్ల వెంకటరామయ్య, జాలాది విజయేంద్రరావు, జయరాజ్, గోలి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా హనుమాన్ జయంతి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో తుళ్లూరు ప్రపత్తి ఆంజనేయస్వామి

దుగ్గిరాల, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. తెనాలి- విజయవాడ మెయిన్‌రోడ్డులో దుగ్గిరాల కొత్తలాకు వద్దగల 42 అడుగుల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు జరిపారు. స్వామికి ఉదయాన్నే అభిషేకాలు జరిపి కనువిందుగా అలంకరించారు. ఆలయ ఆవరణలో పలువురు దంపతులచే శాంతిహోమం జరిపించారు. వందలాది మంది భక్తులకు భారీ హనుమంతుని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఆవరణలో మహిళలు సామూహిక హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. మధ్యాహ్నం 11గంటల నుంచి భక్తులకు పెద్దయెత్తున అన్నదానం జరిపారు. పెదకొండూరు కరకట్టపైనున్న ఆంజేయస్వామి, తుమ్మపూడి, ఈమని, తాడిబోయినవారిపాలెం తదితర గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించారు. దుగ్గిరాల శ్రీచెన్నకేశవస్వామి ఆలయలోనూ, చెన్నకేశవనగర్ రైల్వేగేటు సమీపంలోని ఆంజనేయస్వామి మందిరం వద్ద ప్రత్యేక పూజలు జరిపారు.

● తుళ్లూరు,(ఐనవోలు): మండలంలో భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. తుళ్లూరులోని ప్రపత్తి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా రెండు రోజుల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఐనవోలు ఉప్పలపాడు ఆంజనేస్వామి వారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● ఫిరంగిపురం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఫిరంగిపురంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ ప్రసన్నాంజ నేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయండి

- ఏపీ జీఈఏ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మురళి, చాంద్‌బాషా తదితరులు

తాడేపల్లి టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 5వ తేదీన జరగనున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని ఏపీ జీఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా కోరారు. పట్టణ పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు అందరూ తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే సంఘా నికి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, మంగళగిరి తాలూకా యూనిట్ అధ్యక్షులు మురళి, కార్యదర్శి మాధవరావు, ఉపాధ్యక్షులు సుభాషిని, ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగాభవాని పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు పొన్నూరు నియోజవర్గ మినీమహానాడు

పొన్నూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజవర్గ స్థాయి మినీ మహానాడు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో డీవీసీ కల్యాణ మండపంలో సాయంత్రం 5గంటలకు మినీ మహానాడు ప్రారంభమవుతుందన్నారు. సంగం డెయిరీ చైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడతారన్నారు. నియోజవర్గంలో టీడీపీ కుటుంబ సభ్యులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బహిరంగంగా మద్యం సేవిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట,మే 22 (ఆంధ్రజ్యోతి): బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. గురువారం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఇస్లాంపేటకు చెందిన కారుమూరు అక్షయ్‌కుమార్, ఆలూరి ఆనంద్‌లు బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తుండగా వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

షర్మిలారెడ్డి దీక్ష భగ్నం చేయటం దుర్మార్గం

● మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దిలీప్

పొన్నూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి చేస్తున్న ఆమరణ దీక్షను అప్రజాస్వామికంగా భగ్నంచేయటం దుర్మార్గమని ఆ పార్టీ పొన్నూరు మండల అధ్యక్షుడు అందే దిలీప్ ఓ ప్రకటనలో విమర్శించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌పై కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ విధానాలతో స్టీల్ ప్లాంట్‌లో వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. కాంట్రాక్టు కార్మికులను నిబంధనలు పాటించకుండా తొలగించడం అన్యాయమంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆమరణ నిరాహార దీక్షకు దిగితే దీక్షను పోలీసులు భగ్నంచేసి బలవంతంగా ఆమెను హైదరాబాదుకు విమానంలో పంపిచేశారన్నారు. పోలీసులను అడ్డంపెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను ఇంకెన్నాళ్లు అణగదొక్కుతారని ప్రశ్నించారు. కార్మికుల తరుపున కాంగ్రెస్ పార్టీ అలుపెరగని పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి: పట్టణ సీఐ

పొన్నూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): వాహనం నడిపేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని పొన్నూరు పట్టణ సీఐ వీరానాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్లో వాహనాలను తనిఖీచేశారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, సరైన వాహన పత్రాలు, నెంబర్‌ప్లేట్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వెళ్తున్న పలువురిని గుర్తించి అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా సీఐ వీరానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనం నడిపేవారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనానికి ఇన్సూరెన్స్, పొల్యూషన్, సీ బుక్ వంటివి పక్కాగా ఉండాలన్నారు. వాహనాలకు నెంబర్‌ప్లేట్లు ఉండాలని వాటిపై ఎటువంటి స్టిక్కర్లు అంటించరాదన్నారు. అదేవిధంగా ద్విచక్రవాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని. కారు, ఇతర వాహనాలు నడిపే వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వీరమహిళకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న మంత్రి మనోహర్

పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

● మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్లాలని పార్టీ సభ్యత్వాలు రానున్న రోజుల్లో అంచనాలకు మిన్నగా జరగాలని ఆ పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. బుధవారం పట్టణంలోని గౌతమ్‌గ్రాండ్ హోటల్లో జనసేన క్రియాశీలక వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన పార్టీ సభ్యత్వ నమోదు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన జనసైనికులకు, వీర మహిళలకు ప్రశంసాపత్రాలు అందించారు. భవిష్యత్తు కార్యాచరణపై పలు విషయాలు చర్చించారు. అనంతరం క్రియాశీలక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట,మే 22 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలోని చినరావూరుతోటలో జరుగుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. డ్రెయిన్లలోని సిల్ట్‌ను తొలగిస్తున్నామన్నారు. వర్షాకాలం నాటికి సిల్ట్ తొలగింపు పనులను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి

❑ జై హనుమాన్ నామస్మరణతో మారుమోగిన ఆలయాలు
❑ ఘనంగా సువర్చలా సమేత ఆంజనేయ స్వామి కల్యాణం
❑ భక్తులతో కిక్కిరిసిన హనుమ ఆలయాలు
❑ పొన్నూరు వీరాంజనేయస్వామికి పొన్నూరు, మాచర్ల ఎమ్మెల్యేల ప్రత్యేక పూజలు



తెనాలిలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న భక్తులు



పొన్నూరు వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్ దంపతులు

పొన్నూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతిని పొన్నూరు, చేబ్రోలు పట్టణ, మండల గ్రామాల్లో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రామాలయాలు, హనుమ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయాయి. హనుమత్ జయంతిని పురస్కరించుకుని ఆయా ఆలయాలను ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో, రంగురంగుల పూలతో అలంకరిచారు. తెల్లవారు జామున 4గంటల నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. పొన్నూరులోని సహస్రలింగేశ్వరస్వామి, శ్రీవీరాంజనేయ స్వామి వార్ల ఆలయంలో జరిగిన పూజల్లో సంగం డెయిరీ చైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు, కుమార్తె నాగసాయివైదీప్తి, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దంతులు పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేలను ఆలయ అధికారులు, అర్చకస్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం వేద ఆశీస్సులు అందించి స్వామివారి ప్రసాదాలు అందించారు. పలువురు ప్రముఖులు ఈ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంలోని తెలగపాలెం శ్రీకోదండ రామాలయంలోని దాసాంజనేయస్వామి వారికి హనుమత్ జయంతిని పురస్కరించుకుని విశేషపూజలు జరిపారు. అర్చకులు చిలకపాటి లక్ష్మణ్‌రామాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్‌కు పంచామృత స్నపన, నాగవల్లిసహిత పుష్పార్చన వైభవంగా జరిపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. పట్టణంలోని శ్రీకరవాల వీరాంజనేయస్వామి వారి ఆలయంలో స్వామి వారి జయంతిని పురస్కరించుకుని పూజా కార్యక్రమాలు జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోటంరాజు తాండవకృష్ణ. కందుల వెంకటేశ్వర్లు, ఆలపాటి వెంకటేశ్వరగుప్త, మన్నెం తిరుపతిరాయుడు కార్యక్రమాలను పర్యవేక్షించారు. మండలంలోని చింతలపూడిలో ఆంజనేయస్వామి వారి ఆలయంలో హనుమత్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. మండలంలోని నండూరులో శ్రీపంచముఖీ హనుమత్ పీఠంలో శ్రీవీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, శతసహస్ర నాగవల్లీ దళార్చన జరిపారు. హనుమ ఉపాసకులు బ్రహ్మశ్రీ వల్లూరు శ్రీనివాసశర్మచే నిర్వహించిన హనుమ జన్మకథ ఆద్యంతం ఆకట్టుకుంది. చేబ్రోలు మండలంలో రామాలయాలు, హనుమ ఆలయాల్లో హనుమత్ జయంతిని వైభవంగా నిర్వహించారు.



సోమసుందరపాలెం ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



ప్రత్యేక అలంకరణలో కరవాల వీరాంజనేయస్వామి, శివాలయంలోని ఆంజనేయస్వామి

పోటెత్తిన భక్తజనం

పొన్నూరు టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని సహస్రలింగేశ్వర స్వామి, వీరాంజనేయస్వామి వార్ల దేవస్థానంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రెండు రాష్ట్రాల నుంచి దీక్షాపరులు ఆలయానికి విచ్చేసి స్వామి దర్శనం చేసుకున్నారు. తెల్లవారు జామునుండి శ్రీ వీరాంజనేయస్వామి వారి మూలవిరాట్‌కు అర్చక స్వాములు అభిషేకపూజలు శాస్త్రయుక్తంగా జరిపారు. అనంతరం లక్ష తమలపాకులు, మల్లెపూలతో విశేషపూజలు జరిపారు. సాయంత్రం శ్రీ సువర్చలాసమేత శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఉత్సవ మూర్తులకు దివ్య తిరుకల్యాణ మహోత్సవం కనులపండుగగా జరిపారు. వేద పండితులు శాస్త్రోక్తంగా స్వామివార్ల కల్యాణాన్ని జరిపారు. ఆలయ ఈవో గద్దె వెంకట అమర్‌నాథ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అర్చకస్వాములు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

● కొల్లిపర : మండలంలోని వల్లభాపురం, మున్నంగి, తూములూరు, హనుమాన్‌పాలెం, చక్రాయపాలెం, అత్తోట తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో శ్రీ అంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు వైభవంగా పూజలు చేశారు. మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి ఆలయంలో శ్రీ అంజనేయస్వామికి పండితులు జగన్నాధాచార్యులు, సత్యన్నారాయణచార్యులు, సీతారామచార్యులు, చల్లా కిరణ్‌శర్మ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అదేవిధంగా కొల్లిపర మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీ అంజనేయస్వామి విగ్రహం వద్ద భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. కృష్ణానది కరకట్ట సమీపంలోని అభయాంజనేయస్వామికి పండితులు అభిషేకాలు చేశారు. ఆయా దేవాలయాల వద్ద వివిధ భజన సంఘాల వారు తాళాల భజనలు నిర్వహించారు. కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దావులూరు అడ్డరోడ్డు వద్ద అభయ అంజనేయస్వామి ఆలయంలో అడపా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జయంతిని వైభవంగా నిర్వహించారు. దేవాలయాల వద్ద కమిటీ సభ్యులు భక్తులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

● తెనాలి, మారీసుపేట: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో శ్రీదాసాంజనేయ స్వామివారి 16వ వార్షిక మహోత్సవాలను మూడో రోజు ఘనంగా నిర్వహించారు. గురువారం శ్రీవిద్యాపీఠంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) వారి స్వయం పర్యవేక్షణలో ఉత్సవాలలో భాగంగా శ్రీదాసాంజనేయ స్వామివారికి పంచామృత అభిషేకాలు, నాగవల్లీ దళార్చన, సిందూరంతో విశేష అర్చనలను నిర్వహించి 2000ల మామిడిపండ్లతో అలకరించి నివేదించారు. ఈ సందర్భంగా బాలస్వామి స్వామివారు హనుమత్ జయంతి విశిష్టతలను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకట కృష్ణమూర్తి, కార్యదర్శి రావూరి సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, మానేపల్లి శ్రీనివాసరావు, గోపు రామకృష్ణ, ధనలక్ష్మి, సావిత్రి, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: మండలంలోని సోమసుందరపాలెంలో హనుమత్ జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ కేసన కోటేశ్వరరావు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శోభాయాత్ర

తెనాలి అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పలు రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించి పూజలు జరుపుకున్నారు. బోసురోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయంలో మన్యుసూక్త అభిషేకం, తమలపాకులు, సిందూరం, సహస్రనామ పూజలు నిర్వహించారు. వెంకటసుబ్బయ్య కుటుంబీకులు పర్యవేక్షణలో అర్చకులు చక్రవర్తి, పవన్‌కుమార్, మాధవ్, షణ్ముఖవర్ధన్ పూజలు చేశారు. మారీసుపేటలోని అప్పలస్వామి ఆలయంలో వీరాంజనేయస్వామి వారికి అప్పాలమాల సమర్పించారు. పండ్ల రసాలతో, డ్రై ఫ్రూట్స్‌తో అభిషేకం చేశారు. శివనందకుమార్, నారాయణస్వామి పాల్గొన్నారు. మారీసుపేట శివాలయంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు గురువారం ముగిశాయి. పంచామృతాభిషేకం, మంత్రపుష్పం, చాలీసా పారాయణ అనంతరం స్వామి వారి కల్యాణం ఘనంగా జరిపించారు. గాంధీచౌక్‌లోని రుక్మిణి సత్యభామా సమేత గోవర్ధనస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి గ్రామోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేదాంతం మాధవకుమార్ బృందం పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభించారు. లక్ష హనుమాన్ చాలీసా పారాయణ ఉత్సవాలు చేపట్టారు. ఈవో శ్రీనివాసరెడ్డి, అర్చకులు శ్రీనివాసమూర్తి, కుమార్, కౌన్సిలర్లు యుగంధర్, త్రిమూర్తి పాల్గొన్నారు. సుల్తానాబాద్ నుండి పెద్ద సంఖ్యలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. అలంకరించిన వాహనంలో ఆంజనేయస్వామి విగ్రహం ఉంచి బోసురోడ్డులోని చిట్టి ఆంజనేయస్వామి ఆలయం వరకు భారీ శోభాయాత్ర నిర్వహించారు.



కొల్లిపరలో శ్రీఅభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



పొన్నూరు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దంపతులు

మున్సిపల్ పాఠశాలల్లో ఆట స్థలాలేవి..?

● నాలుగు పాఠశాలల్లో సెంటు స్థలం లేదు
● ఒట్టిమాటలా విద్యార్థుల శారీరక వికాసం



గంగానమ్మపేటలోని ఉన్నత పాఠశాల

ఉన్న కొద్దిపాటి స్థలంలో తలపెట్టిన నిర్మాణం

తెనాలి అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయి. విద్యార్థి దశలో విద్యతో పాటు పాఠశాలల్లో క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపుతారు. ప్రైవేట్ పాఠశాలలే కాదు మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో కూడా ఆట స్థలాలకు చోటే లేదు. కనీసం సెంటు స్థలం కూడా మిగలకుండా పోయింది. పట్టణంలో ఐదు మున్సిపల్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఒక్క ఐతానగర్ హైస్కూల్‌లో మాత్రమే తగినంత ఆట స్థలం ఉండగా గంగానమ్మపేట టీఎస్‌రావు హైస్కూల్, కొత్తపేట మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో క్రీడలకు తగినంత స్థలం లేదు. దీంతో ఆ పాఠశాలల్లో విద్యార్థులు ఆటల సంగతే మరిచిపోతున్నారు. ఈ పాఠశాలల్లో 400 నుంచి 1000 వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికి తరగతుల నిర్వహణకు భవనాలు నిర్మించడానికే స్థలం సరిపోయింది. ఎక్కడైనా కాస్తంత స్థలం ఉంటే అక్కడ మరో నిర్మాణానికి అనుమతి ఇవ్వడం విశేషం. గంగానమ్మపేట హైస్కూల్‌లో 400 మంది విద్యార్థులు చదువుతుండగా 8 తరగతి గదులు ఉన్నాయి. అవి సరిపోతాయనుకున్న తరుణంలో గత ప్రభుత్వం నాడు-నేడు పేరిట పాఠశాల ఆవరణలోని కొద్ది స్థలంలో రెండు అంతస్తుల నాలుగు తరగతుల గదుల నిర్మాణం చేపట్టారు. ఇది పునాది దశలోనే ఆపేశారు. పిల్లర్లు కోసం వేసిన చువ్వలు నాలుగేళ్లుగా అలాగే ఉన్నాయి. కనీసం ప్రహరీ కూడా లేకుండా ఉంది. రోడ్డు మార్జిన్‌లో సిమెంట్ రేకులు వేసి ప్రహరీ అనిపించారు. బాల బాలికలకు, ఉపాధ్యాయులకు ఈ హైస్కూల్‌లో కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. కొత్తపేట బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో వెయ్యిమంది వరకు విద్యార్థులు చదువుతుంటే వారి క్రీడలకు కూడా ఎలాంటి స్థలం లేకుండా పోయింది. ప్రతి పాఠశాలలో ప్రతిరోజు విద్యార్థులకు ఆటల కోసం పీరియడ్ కేటాయిస్తారు. తగిన స్థలం లేకపోవడంతో వ్యాయామ ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను ఆడించే వీలులేక ఖాళీగానే ఉండాల్సి వస్తోంది. బాలికల ఉన్నత పాఠశాలలో ఉన్న కొద్దిపాటి స్థలంలో రెండు అంతస్తుల భవనాలను నాడు-నేడులో నిర్మించి వదిలేశారు. పట్టణంలో తగిన క్రీడా మైదానాలను గుర్తించి విద్యార్థుల మానసిక శారీరక వికాసానికి ఆటల్లో ప్రావీణ్యం సాధించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతి వార్డులో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక తదితరులు

తెనాలి, మారీసుపేట,మే 22 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి వార్డులో పారిశుధ్యం ప్రత్యేక దృష్టి పెట్టామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. గురువారం స్థానిక నాజరుపేట 8వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని డ్రెయిన్లలోని పూడికతీత పనులను చేపట్టామన్నారు. ప్రతి వార్డులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. శానిటేషన్‌ను మెరుగుపర్చి ప్రజలు అనారోగ్యాల బారినపడకుండా చర్యలు కూడా చేపట్టామన్నారు. వార్డు ప్రజలు తమ ఇంటి పరిసరాలతో పాటు వార్డు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం 10వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి శానిటేషన్ సిబ్బంది పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీపీవో సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీజీఈఏ దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు బాలచంద్రమౌళి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మే 22 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతున్న మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో నెల రోజులపాటు యోగా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో యోగా గురించి ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా రేషన్ కార్డులు చేర్పులు, మార్పులు గురించి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పారిశుధ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా రోడ్లపై వర్షపునీరు నిలబడకుండా చూసుకోవాలని తెలిపారు. కాల్వల్లో మురుగునీరు తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్డీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

● దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు బాలచంద్రమౌళి

కొల్లిపర, మే 22 (ఆంధ్రజ్యోతి): 5వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న ఏపీజీఈఏ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏపీజీఈఏ దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్రమౌళి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై చర్చించడం జరుగుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యల గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో తహసీల్దార్ సిద్ధార్థ, సబ్ రిజిస్టర్ ఆదినారాయణరెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ భార్గవ్, దుగ్గిరాల యూనిట్ ఉపాధ్యక్షుడు గుంటూరు పూర్ణచంద్రప్రసాద్, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.